తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 38
పేజీలు - 8
వెల- రూ 5:00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శనివారం 01, జూలై-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## మహిళ పేరిమీదే పోడుపట్టాలు



# పోడు పట్టాలతో పాటు పోడు కేసుల ఎత్తివేత





- ఇకముందు వారిపై ఎలాంటి కేసులూ ఉండవు
- ఆసిఫాబాద్ జిల్లాల్లోనే 47వేల ఎకరాలకు పోడు పట్టాలు
- పోడు పట్టాలతో పాటు రైతుబంధు కూడా అమలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీ ఫేజ్ కరెంట్‌కు ఆదేశాలు
- కౌటాలా వార్ధా మధ్య బ్రిడ్జికి75 కోట్లు మంజూరు
- ఆసిఫాబాద్ వేదికగా సిఎం కెసిఆర్ ప్రకటన

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,జూన్30 : పోడుభూములకు సంబంధించి ఆదివాసీ గిరిజన బిడ్డలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇక వారిపై ఎలాంటి కేసులు ఉండవని స్పష్టం చేశారు. పట్టాలు పంపిణీ చేసిన అనంతరం కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత పేదల బతుకుల గురించి ఆలోచించి చాలా కార్యక్రమాలు తీసుకొచ్చామని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత పేదల బతుకులను ఆలోచించి చాలా కార్యక్రమాలు తీసుకున్నాం. ఒక్క ఆసిఫాబాద్ జిల్లాల్లోనే 47వేల ఎకరాలకు గిరిజన పోడు పట్టాలు ఇస్తున్నాం. ఇందాకే డజన్ పట్టాలు అందజేశా. రేపట్నుంచే మీ మంత్రి, ఎమ్మెల్యేలు ఈ 47వేల ఎకరాల భూమిని వెంటనే అందజేస్తారు. రానున్న మూడు రోజుల్లోనే పట్టాలు అందుతాయి. పట్టాలు అందడమే కాదు.. అందరూ రైతులకు వచ్చినట్టుగా పోడు పట్టాలు పొందినవారికి ఈ ఫసల్ నుంచే రైతుబంధు రాబోతున్నది. గతంలో 300 కోట్లు పెట్టి ఎక్కడెక్కడ అటవీ ప్రాంతాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీఫేజ్ వైర్ కనెక్షన్ లేదో అక్కడ 300 కోట్లు పెట్టి కరెంట్ ఇవ్వమని చెప్పినం. అయితే బావుల్లోకి ఇంకా పోలేదని ఆత్రం సక్కూ చెప్పారు. దీనిపై చీఫ్ సెక్రటరీకి ఆదేశాలివ్వడం జరిగింది. ఎవరెవరు ఆదివాసీలు, గిరిజన బిడ్డలకు త్రీఫేజ్ కరెంట్ లేదో వాళ్లకు రాబోయే రెండు మూడు నెలల్లోనే పొలాలకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోడుభూములు కొట్టుకున్నందుకు ఆదివాసీ గిరిజన బిడ్డల మీద గతంలో కేసులు పెట్టిండ్రు. ఒకవైపు పట్టాలు ఇచ్చి ఆ కేసులు అలాగే ఉంచితే తలాతోక లేనట్టు అవుతుంది కాబట్టి వెంటనే ఆ కేసులను ఎత్తివేస్తాం.. వారిపై కేసులు ఉండవని సీఎం కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అడవి ప్రాంతాలు తిరుగుతున్నప్పుడు.. మావా నాటె.. మావా రాజ్.. నా గూడెంలో నా రాజ్యం.. మా తండాలో మా రాజ్యం అని చెప్పేవాళ్లు. అనేక

గిరిజనులకు పోడు పట్టాలు అందించడంతో పాటు వారికి మరో శుభవార్తను కెసిఆర్ అందించారు.ఎవరెవరు ఆదివాసీలు, గిరిజన బిడ్డలకు త్రీఫేజ్ కరెంట్ లేదో వాళ్లకు రాబోయే రెండు మూడు నెలల్లోనే పొలాలకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోడుభూములు కొట్టుకున్నందుకు ఆదివాసీ గిరిజన బిడ్డల మీద గతంలో కేసులు పెట్టిండ్రు. ఒకవైపు పట్టాలు ఇచ్చి ఆ కేసులు అలాగే ఉంచితే తలాతోక లేనట్టు అవుతుంది కాబట్టి వెంటనే ఆ కేసులను ఎత్తివేస్తాం.. వారిపై కేసులు ఉండవని సీఎం కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అడవి ప్రాంతాలు తిరుగుతున్నప్పుడు.. మావా నాటె.. మావా రాజ్.. నా గూడెంలో నా రాజ్యం.. మా తండాలో మా రాజ్యం అని చెప్పేవాళ్లు. అనేక దశాబ్దాలు మీరు పోరాటం చేసినా అది సాధ్యం కాలేదు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాదాపు 3 నుంచి 4వేల గిరిజన గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాదు.. కుమ్రంభీమ్ పేరిట కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసుకున్నాం. ఉద్యమం సమయంలో మీరంతా సహకరించి నాతో పోరాటంలో ఉన్నారు కాబట్టి తెలంగాణ రాష్ట్రం వచ్చింది. తెలంగాణ వచ్చింది కాబట్టే కుమ్రంభీమ్ జిల్లా వచ్చింది. ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా చాలా చక్కటి ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నందుకు అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా.



## కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్ పోరాటం

### ఆర్డినెన్స్ ప్రతులను దగ్ధంచేసిన సిఎం కేజ్రీవాల్



న్యూఢిల్లీ,జూన్30 : ఢిల్లీ బ్యూరోక్రాట్ల బదిలీలు, పోస్టింగ్‌లపై పట్టు కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్ తన పోరాటాన్ని ఉధృతం చేయనుంది. జులై 3 నుంచి ఆర్డినెన్స్ ప్రతులను దగ&ధం చేసేలా దశల వారీ ప్రచార కార్యక్రమానికి ఆప్ పిలుపు ఇచ్చింది. దేశ రాజధానిలో బ్యూరోక్రాట్ల సర్వీసులపై పట్టు బిగించే ఆర్డినెన్స్ ప్రతులను ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ దగ్ధం చేస్తారు. ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కోత విధిస్తూ మే 19న కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి సహకరించాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విపక్ష నేతలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆర్డినెన్స్ దేశ సమాఖ్య వ్యవస్థకు, సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని కేజ్రీవాల్ చెబుతున్నారు. ఆర్డినెన్స్ విషయంలో పలు బీజేపీయేతర పక్షాలు ఆప్‌నకు మద్దతుగా నిలిచాయి. ఇక ఈ అంశంపై కాంగ్రెస్ ఇంకా తన వైఖరి స్పష్టం చేయలేదు. పట్నా భేటీలోనూ కాంగ్రెస్ మద్దతును ఆప్ కోరగా ఇరు పార్టీలు ఈ అంశాన్ని పరిష్కరించుకోవాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సూచించారు.

## ముంపు గ్రామాల ప్రజలను ముంచేశారు

- నిర్వాసితులను గాలికొదిలేసి నిధులు మెక్కేశారు
- దీనిని సంక్షేమ పాలన అంటారా అని ప్రశ్నించిన లెఫ్ట్
- 11వ రోజుకు చేరుకున్న పోరేకేక యాత్ర
- ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

7లో..



## ఉమ్మడి పౌరస్మృతికి వేగంగా అడుగులు

- పార్లమెంట్ సమావేశాల్లోనే పెట్టే ప్రయత్నాలు
- బిజెపి వేస్తున్న అడుగులపై అనేక అనుమానాలు




న్యూఢిల్లీ,జూన్30 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లు ను వచ్చే నెలలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించబోతోంది. వివిధ వర్గాల వాదనలను ఈ సంఘం స్వీకరిస్తుంది. అత్యున్నత స్థాయి విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయినా ఎన్నికలకు ముందే దీనిని మమ అనిపించాలని చూస్తున్నట్లు సమాచారం.పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని, వివిధ వర్గాల వాదనలను ఆ కమిటీ స్వీకరిస్తుందని ప్రచారం సాగుతోంది.

4లో..

## తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలపై మాట్లాడాలి



- గిరిజన వర్సిటీ..కోచ్ ఫ్యాక్టరీ..బయ్యారం ఉక్కు ఏమయ్యింది
- వీటిపై మాట్లాడకనే వరంగల్‌లో అడుగు పెట్టాలి
- ప్రధాని మోడీని డిమాండ్ చేసిన మంత్రి కెటిఆర్
- మానుకోటలో గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ

మహబూబాబాద్,జూన్30 : తెలంగాణ గిరిజన బిడ్డలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర మున్సిపల్,ఐటీ శాఖల మంత్రి కె తారకరామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజనులకు పోడుభూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు.ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా గిరిజన యూనివర్శిటీని ఏర్పాటుచేస్తామని పార్లమెంట్ లో ప్రధాని నరేంద్ర మోదీ, ప్రభుత్వం హామీ ఇచ్చింది. కేంద్రం అడిగితే గిరిజన యూనివర్శిటీ కోసం 360 ఎకరాల భూమిని ములుగు జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటి వరకు వర్సిటీని ఎందుకు నెలకొల్పలేదని ప్రశ్నించారు. బయ్యారంలో

మిగతా 2లో..

## నేటి గ్రూప్ 4 పరీక్ష కు అన్నీ ఏర్పాట్లు పూర్తి

### పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



5లో..


## ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన జెండా ఎగరాలి

- పవన్ సమక్షంలో జనసేనలో చేరిన తోట సుధీర్
- వైసిపిని ఓడించడం పెద్ద పనేమీ కాదన్న పవన్

7లో..



## ప్రజానాడి




## ఆసిఫాబాద్ జిల్లాలో సిఎం కెసిఆర్ పర్యటన

### తొలుత బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం

### కుమ్రం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి

### కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం



కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,జూన్30 : జిల్లాలో పోడు పట్టాల పంపిణీ కోసం వచ్చిన సీఎం కేసీఆర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పను కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్పకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కుమ్రంభీం చౌరస్తాలోని కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆసిఫాబాద్‌కు చేరుకున్న ఆయన ముందుగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయం ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొత్తగా నిర్మించిన జిల్లా

మిగతా 2లో..

# మహిళ పేరిమీదే పోడుపట్టాలు

- పట్టాలు పొందిన రైతులకు రైతుబంధు
- రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఎకరాల పోడు పట్టాలు
- తెలంగాణ ఉద్యమంలో వెంట నడిచారని కెసిఆర్ ప్రస్తావన



కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,జూన్30 : రాష్ట్రవ్యాప్తంగా పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ అన్నారు. పోడు పట్టాలను మహిళల పేరుమీదనే ఇస్తున్నామని అన్నారు. పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు ఇతర రైతులకు మాదిరిగానే రైతుబంధు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కొందరు గిరిజన రైతులకు రైతుబంధు చెక్కులను అందజేశారు. పోడు పట్టాలను మహిళల పేరు మీదనే ఇస్తున్నట్లు తెలిపారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం మాత్రమే కాదని, ఈ భూములకు సంబంధించి గతంలో గిరిజనులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తామని చెప్పారు.ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షా 51 మంది రైతులకు నాలుగు లక్షల 50 వేల ఎకరాల పోడు భూమిని పట్టాలు ఇచ్చి పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులంతా సహకరించారని సీఎం గుర్తుచేసుకున్నారు.ఆసిఫాబాద్ జిల్లాలో డిస్టిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి, పోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు, గిరిజనులను ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. ఆసిఫాబాద్ జిల్లాలో రెండు మూడు రోజుల్లో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తవుతుందని సీఎం చెప్పారు. ఇప్పటివరకు గిరిజన గ్రామాలకు కరెంటు సదుపాయం కల్పన దాదాపు పూర్తయ్యిం దని, ఇకపై అన్ని జిల్లాల్లో మారుమూల గ్రామాల్లో ఉన్న గిరిజనుల పొలాలకు కూడా త్రీఫేజ్ కరెంటు ఇస్తామని సీఎం ప్రకటించారు.తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా తాను ఏ పిలుపునిచ్చినా ఉద్యోగులు శక్తివంచన లేకుండా తమవంతు కృషిచేశారని సీఎం కేసీఆర్ కొనియాడారు. అందరి సహకారం వల్లే నాడు స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. స్వరాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని చెప్పారు. జిల్లాలో డిస్టిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరమైన సందర్భమన్నారు. నూతన ఎస్పీ ఆఫీస్‌ను కూడా ప్రారంభించుకున్నామని చెప్పారు. త్వరలో మెడికల్ కాలేజీ కూడా అందుబాటులోకి రానున్నదని సీఎం పేర్కొన్నారు.

అంతకుముందు డిస్టిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌ను ప్రారం భించేందుకు వచ్చిన ముఖ్యమంత్రికి పురోహితులు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత సీఎం జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించింది కలెక్టర్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కూడా సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. పర్యావరణ పరిరక్షణను గుర్తుచేసే చిత్రపటాన్ని బహూకరించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, విప్ బాల్క సుమన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్, జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు, గిరిజనులు, గిరిజన నేతలు పాల్గొన్నారు.

## వేదికపై సాయిచంద్‌కు కెసిఆర్ నివాళి

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రగతి నివేదన సభా వేదికపై తెలంగాణ గాయకుడు, ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పోరేషన్ ఛైర్మన్ సాయిచంద్‌కు నివాళులు అర్పించారు. సభా వేదికపై ఏర్పాటు చేసిన సాయిచంద్ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. సాయిచంద్ బుధవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన హఠాన్మరణం పాలయ్యారు. ఆయన భౌతిక కాయానికి గురువారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

## ఆసిఫాబాద్ జిల్లాలో సిఎం కెసిఆర్ పర్యటన



పోలీస్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అంతకు ముందు పోలీస్ కాంప్లెక్స్ ప్రాంగణంలోకి చేరుకోగానే జిల్లా పోలీసులు సీఎంకు గౌరవ వందనం సమర్పించారు. గాల్లోకి కాల్పులు జరిపి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఎస్పీని తన కొత్త కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ.. సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. ఓ చిత్ర పటాన్ని జ్ఞాపికగా బహూకరించారు. ఈ సందర్భంగా సీఎం వెంట రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్,వేణుగోపాలాచారి తదితరులు ఉన్నారు. ఇలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసిఫాబాద్‌లో వివిధ కార్యక్రమాలతో బిజీబిజీగా ఉన్నారు. ఆ ఆ తర్వాత కలెక్టరేట్‌లో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. కార్యాలయ ప్రాంగణంలోకి సీఎం కేసీఆర్ అడుగుపెట్టగానే పురోహితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సీఎం.. కలెక్టర్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం కలెక్టర్.. సీఎం శాలువా కప్పి సన్మానించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఓ చిత్రపటాన్ని బహూకరించారు.

## కుమ్రం భీమలు ఆశలు నెరవేర్చిన కెసిఆర్ : కెటిఆర్



హైదరాబాద్,జూన్30(ప్రజామంటలు) :నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ నినాదాలనే కాదు.. జల్, జంగల్, జమీన్ అనే కుమ్రం భీం కలలను కూడా అక్షరాలా సాకారం చేసిన ధీరోదాత్తమైన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. మొన్న కొండకోనల్లోని నివాసాలకు మిషన్ భగీరథతో స్వచ్ఛమైన 'జల్', నిన్న కంటికి రెప్పలా కాపాడటంతో.. రాష్ట్రంలో 7.70 శాతం 'జంగల్' పెరిగిందని, నేడు 1.51 లక్షల మందికి ఏకంగా 4.60 లక్షల ఎకరాల 'జమీన్' పంచుతున్నారని చెప్పారు. గ్రామ పంచాయితీల ఏర్పాటుతో 'మావ నాటే మావ రాజ్' స్వప్నం సాకారమైందని వెల్లడించారు. పది శాతానికి పెరిగిన రిజర్వేషన్లతో గిరిజన బిడ్డల్లో ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఇలా ఒకటా.. రెండా.. పోడు భూముల గోడు తీర్చి.. గిరిజన-ఆదివాసీల ఆశలన్నీ నెరవేర్చి, పట్టాలతో పట్టాభిషేకం చేస్తున్న తరుణమిదని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.

## మౌలాలీ ఫ్లై ఓవర్‌పై లారీ బీభత్సం

### టూ వీలర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు




హైదరాబాద్,జూన్30 (ప్రజామంటలు) : నగరంలోని మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధి మౌలాలీలో జీహెచ్ఎంసీకి చెందిన లారీ బీభత్సం సృష్టించింది. శుక్రవారం ఉదయం మౌలాలి ఫ్లై ఓవర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మౌలాలి ఫ్లై ఓవర్ సమీపంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ గేట్ వైపు మార్గంలో ఓవర్ స్పీడ్‌తో దూసుకొచ్చిన లారీ... ఎదురుగా వస్తున్న పలు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. జీహెచ్ఎంసీ లారీ వేగానికి డివైడర్, కరెంట్ పోల్, సీసీ కెమెరా స్టాండ్ ధ్వంసమయ్యాయి. జీహెచ్ఎంసీ లారీ లాలాపేట్ నుంచి మౌలాలీ వైపు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే డ్రైవర్ మద్యం మత్తులో ఈ ప్రమాదం జరిగిందా లేక.. అతివేగాన్ని నియంత్రించకపోవడం వల్ల జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో మౌలాలి ఫ్లైల ఓవర్ వద్ద భారీగా ట్రాఫిక్ స్పందించింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు యత్నించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పోడు రైతులకు పండగరోజు

- పోడు భూములు ఇక వారి సొంతం
- ఆనందంతో పట్టాలు అందుకున్నరైతులు
- భద్ఆరద్రి కొత్తగూడెంలో పట్టాలు అందించిన మంత్రులు
- వారికి రైతుబంధు, బీమ తదితర సౌకర్యాలె కల్పిస్తామని హామీ

పాల్వంచ,జూన్30 : రాష్ట్రంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏండ్ల తరబడి అడవినే నమ్ముకున్న ఆదివాసీ, గిరిజన బిడ్డలను ప్రభుత్వం పట్టాభిషిక్తులను చేస్తున్నది. ఏళ్లకేళ్లుగా వారు గోసపడిన చోటే.. వారికి అపూర్వ గౌరవాన్ని అందిస్తున్నది. వారు సాగు చేసుకున్న పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నది. ఖమ్మం జిల్లా పాల్వంచలోని సుగుణ ఫంక్షన్ హాల్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి మంత్రి హరీశ్ రావు పోడు పట్టాలనుగిరిజన రైతులకు పంపిణీ చేశారు. భద్రాచలం, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన రైతులకు పోడు పట్టాలను అందించారు. ఈ రోజు గిరిజనులకు శుభదినమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పోడు భూములపై గిరిజనులకు ఇక నుంచి సర్వ హక్కులు ఉంటాయని ఆయన చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ఇక నుంచి గిరిజనులే పోడు భూములకు యజమాను లని, వారి భూముల జోలికి ఎవరూ రారని పేర్కొన్నారు. గిరిజన రైతుల భూములకు పట్టాలతోపాటు రైతుబంధు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు .ఇంకా గిరిజనులు ఉద్దేశించి.. 'ఇకపై పోడు భూములపై మీకే సర్వ హక్కులు. మీ పేరుతో ధరణిలో భూమి రికార్డవుతుంది. ఇక ఈ భూముల వైపు అటవీ అధికారులు కన్నెత్తి కూడా చూడరు. గతంలో పోడు భూముల వివాదాలకు సంబంధించి గిరిజనులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేస్తాం. ఈ భూములు వారసత్వంగా కూడా సంక్రమించే హక్కు కల్పిస్తాం. అంతేగా పోడు భూములు పొందిన రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తాం. రైతులకు అందే ప్రతి స్కీమ్ పోడు భూములకు వర్తిస్తుంది. అకాల వర్షాలతో పంట నష్టపోతే పరిహారం అందుతుంది. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా కూడా గిరిజనులు అవకాశాలు పొందుతారు. గిరిజనులు బ్యాంకుల నుంచి పంట రుణాలు కూడా పొంద వచ్చు' అని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలోని తండాలన్నింటినీ గ్రామ పంచాయతీలుగా మార్చామని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలిపిన నాయకుడు కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. ఇప్పటివరకు 22 మహిళా గిరిజన వెల్ఫేర్ కాలేజీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి గిరిజన తండాకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. గిరిజన బిడ్డలకు నాణ్యమైన వైద్యం అందిచేందుకు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ నిధి ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో 13,139 ఎకరాలు సాగుచేసుకుంటున్న 6,589 మంది లబ్దిదారులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. సమైక్య పాలనలో పోడు పట్టాలు లేక అరిగోస పడిన ఆదివాసీలు పట్టాలు అందుకోవడంతో సంతోషం వ్యక్తంచే శారు. భయంభయంగా గడిపిన చోటే ఇప్పటి నుంచి దర్జాగా బతుకుతామంటూ సంబురపడుతున్నారు. తమకు బతుకుదెరువు కల్పించిన సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామంటూ చేతులు జోడిస్తున్నారు. బుక్కెడు బువ్వ కోసం పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై పోలీసులతో లాఠీ దెబ్బలు కొట్టించారు నాటి సమైక్య పాలకులు.



చేతికొచ్చిన పంట ఇంటికి రాకుండా కందకాలు తవ్వారు. అడవిని నరికారంటూ కేసులు పెట్టారు. ఇంకా అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారు. కానీ, తెలంగాణ ఏర్పడి కేసీఆర్ సీఎం అయ్యాక పోడు భూముల సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. అధ్యయనానికి సబ్ కమిటీ వేశారు. మూడంచెల సర్వే నిర్వహించారు. వాస్తవ స్థితిగతుల ఆధారంగా మార్గదర్శకాలు రూపొందించారు. జీవో 140 ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. సమైక్య పాలనలో 2008 నుంచి 2012 వరకు అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 24 వేల మందికి మాత్రమే పట్టాలు మాత్రమే ఇచ్చారు. కానీ తెలంగాణ ప్రభుత్వం 57,184 మందికి పట్టాలు అందించనుండడమే గాక రైతు బంధు, రైతుబీమా పథకాలనూ అమలు చేయనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక లక్షా 60 వేల 113 ఎకరాల పోడు భూమిని పంపిణీ చేసారు. మొత్తం 50,595 మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందించనున్నారు. కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావుతోపాటు మరో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్లు, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలపై మాట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)


ఉక్కు కర్మాగారం స్టీల్ అథారిటీ ద్వారా పెడుతామని హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలు అయింది. కాజిపేటలో కోచ్ ఫ్యాక్టరీ అన్నారు. కాని నేడు మోసం చేస్తున్నారు. రైళ్లను తయారు చేసే కోచ్ బదులు మరమ్మతులు చేసే దుకాణం పెడుతున్నారు. ఇది ఎంతో అన్యాయమని కెటిఆర్ ఆరోపించారు. ఇచ్చిన మాట తప్పినందుకు తెలంగాణ ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని,ఇచ్చిన హామీలపై వరంగల్ పర్యటనలో ప్రధాని మోదీ సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ప్రధాని నరేంద్ర మోడీ క్షేమపణ చెప్పిన తర్వాతే వరంగల్‌కు రావాలి అని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మరో పదిరోజుల్లో నరేంద్ర మోడీ వరంగల్ కు వస్తున్నారు.. వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజల తరుపున అడుగుతున్నానని ట్రైబల్ యూనివర్సిటీ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం పెడతాం అన్నారు.. ఎందుకు ఉక్కు పరిశ్రమ పెట్టడం లేదు.. వరంగల్ కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెడుతాం అని మాట తప్పార న్నారు. రైళ్లు తయారీ కేంద్రం పెడతామని చెప్పి ఇప్పుడు మెకానిక్ ఫ్యాక్టరీ పెడతా అంటున్నారు అని కేటీఆర్ విమర్శించారు. వీటన్నింటిపై మాట తప్పినందుకు మోదీ క్షమాపణ చెప్పి రావాలన్నారు. పోడు పట్టాల పంపిణీ ద్వారా 4లక్షల 6 వేల ఎకరాలు 1.50 లక్షల మంది రైతులకు మేలు జరుగు తుందని.. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే 24, 972 మంది రైతులకు 70, 434 ఎకరాల భూమిని పంపిణీ చేస్తున్నామ న్నారు. జల్ జంగల్ జమీన్ అనే కొమురం భీం నినాదంతో అన్ని తండాలకు మంచినీరు అందిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. బిందెలు, కుండలు పట్టుకుని ఆడపడుచులు రోడ్డు పైకి వచ్చే పరిస్థితి తెలంగాణ లో లేకుండా పోయిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. హరితహారం పేరుతో చెట్ల పెంపకంతో పాటు ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పోడు పట్టాలు పంపిణీ చేసి భూమి కూడా ఇస్తున్నామన్నారు. 6 శాతం ఉన్న గిరిజనులు, ఆదివాసీల రిజర్వేషన్ ను 10 శాతంకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని కేటీఆర్ అన్నారు. పోడు భూములకు పట్టాలు పొందడంతో పాటు రైతుబంధు, రైతుభీమా పొందుతున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత మీకు పాలన అందుబాటులోకి వచ్చింది అని కేటీఆర్ తెలిపారు. 10 మంది డాక్టర్లు లేని మహబూబాబాద్ సర్కారు దవాఖానకు 110 మంది వైద్యులు వచ్చారు.. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి మోసపోవద్దు.. ఆచరణ సాధ్యం కాని హామీలతో మీ ముందుకు వస్తున్నారు.. వారి మాటలు వింటే మీరు మోసపోతారు అని మంత్రి కేటీఆర్ అన్నారు. గుజరాత్‌లో 21వేల కోట్ల రూపాయలతో కోచ్ ఫ్యాక్టరీ పెట్టారని ఆరోపించారు. గుజరాత్‌కు ఒక న్యాయం. తెలంగాణకు ఒక న్యాయం . ఇది మంచి పద్దతి కాదని అన్నారు. దేశానికి ప్రధాని మంత్రి తప్పా గుజరాత్‌కు కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావడానికి ఆడే అబద్దాలను అసలే నమ్మవద్దని కోరారు. 50 సంవత్సరాలు మోసం చేశారు. మళ్లీ మోసం చేయడానికి వస్తున్నరు. ఆగం కావద్దని సూచించారు. అన్ని రకాలుగా పేదలను కడుపులో



పెట్టుకుని చూసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను భారీ మెజారిటీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు గుమ్మడూరులోని రామచంద్రాపురం కాలనీలో 200 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంత్రి ప్రారంభించారు. లబ్దిదారులకు ఇంటిపేపర్లను అందజేశారు. అంతకుముందు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం రూ.5 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్ మార్కెట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్,ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపి కవిత మాలోత్ పాల్గొన్నారు.

## మానుకోటలో మంత్రికెటిఆర్ పర్యటన

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



మహబూబాబాద్,జూన్30 : మహబూబాబాద్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గుమ్మడూరులోని రామచంద్రాపురం కాలనీలో 200 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంత్రి ప్రారంభించారు. లబ్దిదారులకు ఇంటిపేపర్లను అందజేశారు. అంతకుముందు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం రూ.5 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్ మార్కెట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యా నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు పాల్గొన్నారు.మరికాసేపట్లో గుమ్మడూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో 24,181 మంది పోడు రైతులకు 67,730 ఎకరాలకు పోడు పట్టాలను మంత్రి కేటీఆర్ పంపిణీ చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతారు.అనంతరం గుమ్మడూర్‌లో 200 మంది లబ్దిదారులకు డబుల్‌బెడ్ రూం ఇండ్లను మంత్రి కేటీఆర్ పంపిణీ చేయనున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో 24,181 మంది పోడు రైతులకు 67,730 ఎకరాలకు పోడు పట్టాలు పంపిణీ చేస్తారు.

# పోడు పట్టాలతో పాటు పోడు కేసుల ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలు మీరు పోరాటం చేసినా అది సాధ్యం కాలేదు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాదాపు 3 నుంచి 4వేల గిరిజన గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాదు.. కుమ్రంభీమ్ పేరిట కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసుకున్నాం. ఉద్యమం సమయంలో మీరంతా సహకరించి నాతో పోరాటంలో ఉన్నారు కాబట్టి తెలంగాణ రాష్ట్రం వచ్చింది. తెలంగాణ వచ్చింది కాబట్టే కుమ్రంభీమ్ జిల్లా వచ్చింది. ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా చాలా చక్కటి ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నందుకు అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఒకప్పుడు బెజ్జూర్ నుంచి ఆదిలబాద్ పోవాలంటే చాలా బాధపడేవాళ్లు. కానీ ఇప్పుడు జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయం, ఇంకా చాలా జిల్లా కార్యాలయాలు మీ ముంగిట్లకే రావడం చాలా సంతోషించే విషయమని సీఎం కేసీఆర్ అన్నారు. వర్షాకాలం వచ్చిందంటే మంచం పట్టిన మన్యం అని ఒకప్పుడు పేపర్‌లో వార్తలు వచ్చేవి. అంటురోగాలతో ఆదిలాబాద్ ఆడవిబిడ్డలు సతమతమై చనిపోయేవాళ్లు. మిషన్ భగీరథ ద్వారా చక్కటి నీళ్లు తెచ్చుకున్నాం. వైద్య వ్యవస్థను బాగుచేసుకున్నాం కాబట్టి ఇవాళ మన్యం మంచం పట్టే సమస్య లేనే లేదు. గత మూడేండ్లుగా అటువంటి దుస్థితి నుంచి బయటపడ్డాం. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం చాలా అద్భుతమైన విషయం. ఆ విషయంలో కూడా సక్కూ గారికి, లక్ష్మీగారికి, మీ అందరికీ హృదయ పూర్వక అభినందనలు అని సీఎం కేసీఆర్ తెలిపారు. కోనేరు కోనప్ప వెంటబడి ప్రాణహిత మీద బ్రిడ్జి మంజూరు చేయించారు. కొన్ని కొత్త మండలాలు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ఇప్పుడు కౌటాల మండలం నుంచి వార్ధా నది మీదుగా మహారాష్ట్ర పోవడానికి బ్రిడ్జి కావాలని చెప్పిండు. 75 కోట్లతో దాన్ని మంజూరు చేయడం జరిగింది. ఆ జీవోను ఇప్పుడే అందజేస్తున్నా. ఆసిఫాబాద్‌కు టెక్నికల్ కాలేజీ కావాలని కోనప్ప అడిగారు. వెంటనే ఐటీఐ కాలేజీని కాగజ్‌నగర్‌కు మంజూరు చేస్తున్నా అని తెలియజేసారు. నాగమ్మ చెరువులో బుద్ధుడిని పెట్టుకున్నాం.. దాన్ని మినీ ట్యాంక్‌బండ్‌లా ఏర్పాటు చేయాలని అడిగారు. వెంటనే ఎస్టిమేట్ చేయించి నాగమ్మ చెరువును కూడా పర్యాటక కేంద్రంగా మారుస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు.

## పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలు సరికాదు

బిజెపి అధికార ప్రతినిధి కృష్ణసాగరరావు

హైదరాబాద్,జూన్30 : తెలంగాణ బీజేపీలో అయోమయం.. గందరగోళం నెలకొంది. పార్టీకి నష్టం చేకూరేలా సొంత నేతలు చేస్తున్న బహిరంగ ప్రకటనలు, లీకులను తెలంగాణ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగరరావు ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ లీకులిస్తోన్న నేతలు ఏ పార్టీలో ఉన్నారో మర్చిపోయినట్టున్నారని, బీఆర్ఎస్ , కాంగ్రెస్ కాదు.. బీజేపీ అని గుర్తుంచుకోవాలన్నారు. పార్టీని.. నాయకత్వాన్ని బహిరంగంగా విమర్శించే సంస్కృతి, వ్యవస్థ బీజేపీలో లేదని.. ఉండదని అన్నారు. పార్టీకి నష్టం చేకూరే ప్రకటనలు చేస్తున్న వారంతా.. రాష్ట్ర, జాతీయస్థాయి కమిటీల్లో ఉన్నవాళ్ళేనని కృష్ణసాగరరావు అన్నారు. వాళ్లకు తమ గొంతు వినిపించడానికి పార్టీ తగిన అవకాశం, వేదిక ఇచ్చిందని.. పార్టీ ఎజెండా కంటే.. వ్యక్తిగత ఎజెండాలు ఎప్పటికీ ఎక్కువ కాదన్నారు. పార్టీలో ఒక 'లక్ష్మణ రేఖ' ఉందనే విషయం మర్చిపోకూడదన్నారు. బీజేపీలో ఈ తరహా క్రమశిక్షణా రాహిత్యం, నిర్లక్ష్యపూరిత వైఖరి సహించబడదని కృష్ణసాగరరావు అన్నారు.

## మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం



ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం బిజెపి మండల అధ్యక్షులు బట్టు జకరయ్య ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఇబ్రహీం పట్నం మండలం తిమ్మాపూర్ లో "గడప గడప" కు బీజేపీ నరేంద్ర మోడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వై. బాలు, మండల ఉపాధ్యక్షులు ఉడుత రాజు, పుప్పాల నగేష్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు మాలేపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్లేందుల చారి, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్



ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు): మండలంలోని వేములకుర్తి గ్రామంలో నివసిస్తున్న శివరాత్రి గంగమణి వెంకటి ఇటీవల ప్రమాదవశాత్తు గుడిసె షార్ట్ సర్క్యూట్ తో కాలిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్. డబ్ల్యూ. సిటి వారు వెళ్లి గుడిసెకు కావాల్సిన తాడిపత్రి, స్టీల్ సామాన్లు, 25 కేజీ బియ్యము, నిత్యవసర సామాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్,నేరెళ్ళ మోహన్ రెడ్డి, సర్పంచ్ సున్నం నవ్యశ్రీ సత్యం, చాట్ల గణేష్, దీపక్, రాజేష్ పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్, మెట్ పల్లి వారి సేవ కార్యక్రమం



ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభ కలిగి ఆర్థికంగా స్తోమత లేని పిల్లలకు చదువులో ఎటువంటి ఇబ్బంది కలగవద్దు అనే ధృఢ సంకల్పంతో ఒక మహా యజ్ఞం ప్రారంభించడం జరిగింది. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ మరియు వేములకుర్తి లోని ప్రభుత్వ పాఠశాలలో 44 విద్యార్థులకు నోట్ బుక్స్ (లాంగ్, షార్ట్) ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ సున్నం నవ్యశ్రీ సత్యం, తలారి ఆనందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చాట్ల గణేష్, దీపక్, రాజేష్ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ శివ జ్ఞాపకార్థం "వన్డే క్రికెట్ టోర్నమెంట్"



భీమదేవరపల్లి జూన్ 30 (ప్రజామంటలు): మంజులక్క యువసేన ఆధ్వర్యంలో స్వర్గీయ కానిస్టేబుల్ వేముల శివ స్మారకార్థం శుక్రవారం ముల్కనూర్ హైస్కూల్ గ్రౌండ్ లో ఒక రోజు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివ సేవలను పోలీసు వ్యవస్థ, ముల్కనూర్ గ్రామ ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్లుగా భరత్, శ్రీకాంత్, ప్రశాంత్, స్టాలిన్, రాంరెడ్డి, మహేష్, రాజేందర్ లు వ్యవహరించారు. టోర్నమెంట్ లో గెలిచిన విజేతలకు బహుమతులు బహుకరించి సత్కరించారు.



జనగామ పట్టణంలోని వైశ్యభవన్ లోగల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ నగరేశ్వర సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ పూజారి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో "కుంకుమార్చన", పూజలు జరిగాయి. తదుపరి అన్నదానం జరిగింది.



హుజురాబాద్ పట్టణంలోని పలు వార్డులలో ఇంటింటికి బిజెపి పథకాలపై ప్రచారం చేస్తున్న జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి. ప్రచారం లో భాగంగా మాజీ కౌన్సిలర్ పద్మ, ప్రముఖ హాకీ జాతీయ క్రీడాకారుడు తెలంగాణ హాకీ కోచ్ పరకాల సన్ని ని కలిసి కేంద్ర పథకాలను వివరించారు. పాల్గొన్న బిజెపి నాయకులు ప్రభాకర్, శశిధర్, నల్ల సుమన్, రావుల వేణు, జెల్లా సుధాకర్, తదితరులు ఉన్నారు.

# నిస్వార్థ కార్మిక నాయకుడు సి.హెచ్. రాజారెడ్డి పై

### సీపీఎం, సీఐటీయూ తప్పుడు ప్రచారం మానుకోవాలి



జనగామ జూన్ 30 (ప్రజామంటలు): నిస్వార్థ కార్మిక నాయకుడు సి.హెచ్. రాజారెడ్డిపై సీపీఎం, సీఐటీయూ నీచమైన తప్పుడు ప్రకటనలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని షాప్ అండ్ గ్రెయిన్ మార్కెట్ హమాలి యూనియన్ అధ్యక్షులు మోటే శ్రీశైలం ఖండించారు. జనగామలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీశైలం మాట్లాడుతూ.... గత కొంతకాలంగా సీపీఎం, సీఐటీయూ నాయకులు రాజకీయ హినస్థితికి దిగజారారని, రాజకీయ లక్ష్యం లేకుండా తప్పుడు నిదారోపనాలు చేస్తున్నారని, నిస్వార్థ రాజకీయ నాయకుడు ప్రముఖ కార్మిక నాయకుడు రాజారెడ్డి పై చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిన్న సీఐటీయూ నాయకులు పత్రికా ప్రకటనలో రాజారెడ్డి పై చేసిన విషప్రచారాన్ని ప్రజలు చూస్తూ ఊరుకోరని, అసలు యూనియన్ గురించి ఏమీ తెలియని వ్యక్తితో సీపీఎం నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకొక పోతే ప్రజలచేత తగిన ఫలితం అనుభవిస్తారని అన్నారు. 2007లో సీపీఎం పార్టీకి రాజారెడ్డి రాజీనామా చేసి బయటకు వస్తున్న సందర్భంలో ఆకుల పెంటయ్య యూనియన్ కు అధ్యక్షుడుగా చేసి వారికి బాధ్యత అప్పగించారని, నాటి నుండి నేటి వరకూ వ్యవసాయ మార్కెట్ లో గేటు వద్ద గల జెండా గద్దె నిర్మించుకుని ప్రతి సంవత్సరమూ మేడే జెండాలు ఎగుర వేస్తున్నా మన్నారు. అలాంటి గద్దెను అరాచకంగా సీపీఎం నాయకులు మోకు కనకా రెడ్డి, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, చుంచు విజేందర్, బుక్యా చందు నాయక్, లోకల్ పది మంది వచ్చి మా గద్దెను కూల్చితే టీడీపీ నాయకులు తీవ్రంగా ప్రతిఘటిస్తే క్షమాపణ చెప్పారని, తిరిగి మేము ఆ గద్దెను నిర్మించుకుని మే 1వ తేదీన తోరణాలు జెండాలు కట్టుకొని జెండా ఎగరవేశామని, అప్పటికి సమస్య లేదు కానీ జూన్26వ తేదీన గేటుకు సీఐటీయూ అని వ్రాస్తే యూనియన్ పేరు వ్రాసుకున్నామని, ఈ వాస్తవాన్ని మభ్యపెట్టి యూనియన్ నాయకులపై పై కేసులు పెట్టీ తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకొమని కమ్యూనిస్టు సిద్ధాంతాలు వదలకుండా వామపక్ష ఐక్యతకు భంగం వాటిల్లకుండా హినస్థితికి దిగజారి ఎస్ సి ఎస్.టి కేసులు పెడతామని భయపెట్టే రాజకీయాలను వదులుకోవాలని, షాప్ అండ్ గ్రీన్ మార్కెట్ హామాలీ యూనియన్ భవనం మా కార్మికుల కష్టార్జితంతో నిర్మించు కున్నామని, ఇది ఎవ్వరి సొత్తు కాదని, కార్మికులపై రాజకీయ ప్రతాపం చూపొద్దని కోరారు. ఈ సమావేశంలో కర్నేకంటి వెంకట నర్సయ్య, చామకుర యాకూబ్, బుడిగే వీరాస్వామి, బుమల్ల ఐలయ్య, దాయ నగేష్, జాయ యాదగిరి, రాజు, సిద్దులు పాల్గొన్నారు.

## మాల సంఘం అధ్యక్షులుగా రవీందర్



సన్మానించిన జడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి జూన్ 30 (ప్రజామంటలు): చిగురుమామిడి కేంద్రంలో మాల కుల సంఘం అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో బొలుమల్ల రవీందర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన అధ్యక్షుడు బొలుమల్ల రవీందర్ ను స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ.... కుల సంఘాల నాయకులు కులాల సమిష్టి ప్రయోజనాల కోసం పాటుపడాలని, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని, ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సబ్బండ కులాలు, సకల జనుల పాత్ర అమోఘమైందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. శాసన సభ్యులు వొడితెల సతీశ్ కుమార్ మండలంలోని వివిధ కులాలకు కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించారు. శాసన సభ్యులు సహకారముతో మాల సంఘంలోని బీదవారికి డబుల్ బెడ్ రూములు, దళిత బంధులో తగిన ప్రాధాన్యతనిస్తామన్నారు. ఈ కార్యక్రమములో పోటు మల్లారెడ్డి, సంఘ పెద్దలు కొప్పుల ప్రసాద్ , బీస కనకయ్య, మాదారి పోశయ్య, నాగలి చిన్న అంజయ్య, బొలుమల్ల జానయ్య, రాగుల ధర్మేందర్, గాజుల జయరాజు, కొప్పుల భాస్కర్, రాకం అనిల్ కుమార్, దొంత సదానందం, బొలుమల్ల రాజయ్య, బోలుమల్ల అంజనేయులు, మాశం సది కుమార్, పాశం శ్రీనివాస్, పాశం బాలయ్య, జంగా మైసయ్య, రంగు రాయమల్లు, తఠ్రల సంజీవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలి




జనగామ జూన్ 30 (ప్రజామంటలు): పంచాయతీ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రిస్టియన్ గ్రౌండ్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీతో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు కదం తొక్కారు. జిల్లా కలెక్టరేట్ గేట్ ఎదుట ఐదు గంటల పాటు బైఠాయించి ఎర్రటి ఎండలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం జిల్లా కలెక్టరేట్ ఏవోకి అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సుధాకర్ జిల్లా చైర్మన్ రాపర్తి రాజులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు గ్రామపంచాయతీ కార్మికుల శ్రమ ఫలితంగా తీసుకుంటూ పంచాయతీ కార్మికుల సమస్యలను మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. జనగామ జిల్లాలో 11 నెలల నుండి గ్రామపంచాయతీలలో పెండింగ్ వేతనాలు ఉన్నాయని, వాళ్ళు ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. డిపిఓ కలెక్టర్ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్లు పగిడిపల్లి మల్లేష్, నారోజు రామచంద్రం, డి. శ్రీశైలం బత్తిని వెంకన్న బస్వ రామచంద్రం, జేఏసీ జిల్లా నాయకులు ఎస్. విజేందర్, జె. ప్రకాష్, రాజేంద్రప్రసాద్, గుర్రం లాజర్, జీడి ఆనందం, గుగులోతు రతన్ సింగ్, టి. యాకూబ్, బి. సురేష్, వి. రాజేశం, రాజకుమార్, సాంబారి కృష్ణమూర్తి, ఎం. రామనారాయణ ఉప్పలయ్య, పి నాగయ్య, ఎం సుధాకర్, రమేష్, శ్రీనివాస్, ఎన్. యాకయ్య, పాల్గొన్నారు.

## విద్యార్థుల హాస్టల్, కమ్యూనిటీ భవనం కేటాయింపునకు వినతి



జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు): జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో జగిత్యాల నియోజకవర్గ మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు, కుల సంఘ మండల ,గ్రామాల నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థుల కోసం హాస్టల్, సంఘ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 60 వేలకు పైగా ఉన్న మున్నూరు కాపు కుటుంబాలున్నాయని, సమావేశాల నిర్వహణ, ఇతర కార్యక్రమాలకు సంఘ భవన నిర్మాణం, విద్యార్థుల కోసం హాస్టల్ వసతి ఆవశ్యకతను వారు వివరించా రు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సానుకూలం గా స్పందించి మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకె ళ్లాలని తన వంతు సహకారం తప్పకుండా ఉంటుం దని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా సీనియర్ సిటీజనన్స్, పెన్షనర్ల, అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, విద్యావంతుల వేదిక సాసల మల్లి కార్జున్, మున్నూరు కాపు నియోజకవర్గ నాయకులు కోల శ్రీనివాస్, జంగిలి రాజి రెడ్డి, ఆకుల లక్ష్మీ నారాయణ, సమిండ్ల శ్రీనివాస్, వెంకట్, సత్యం, చిట్ల రమణ, కొల్లూరి వేణు, అంజయ్య, నీలి మల్లయ్య, రమేష్, తిరుపతి, లైసెట్టి వెంకటి, కొక్కు గంగాధర్, తేలు రాజు, రమేశ్, పుప్పాల కిషోర్, గంగాధర్, గంగారాం, నియో జకవర్గ, మండల,గ్రామ సంఘాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## గణితంలో కుమార్ రాగుల కు డాక్టరేట్



నర్మెట జూన్ 30 (ప్రజామంటలు): కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు కుమార్ రాగులకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కే.యు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి శుక్రవారం కుమార్ రాగులకి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. "న్యూమరికల్ మెథడ్స్ ఫర్ ఎ క్లాస్ అఫ్ సింగులర్లీ పట్టర్బ్డ్ డిఫరెన్షియల్ డిఫరెన్స్ ఈక్వేషన్స్" అనే అంశంపై కే యు మ్యాథమేటిక్స్ విభాగం, సహాయ ఆచార్యులు డాక్టర్ జి.బి.యస్.ఎల్. సౌజన్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హనుమంతపూర్ గ్రామం నర్మెట్ట మండలం, జనగామ జిల్లా చెందిన కుమార్ రాగుల ప్రస్తుతం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్, బాసర, గణిత విభాగంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 6 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మరియ పరిశోధనా విద్యార్థులు కుమార్ రాగులను అభినందించారు.



జగిత్యాల అర్బన్ మండల మోతె గ్రామంలో గంగమ్మ తల్లి బోనాల జాతర మహొత్సవానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై గంగమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ పుత్రులు ఎమ్మెల్యేని సన్మానించారు. అనంతరం 14 లక్షలతో నిర్మిస్తున్న మోతె చెరువు మత్తడి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### లేదంటే జూలై 10న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు



జనగామ జూన్ 30 (ప్రజామంటలు): గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇచ్చిన హామీలు వారం రోజులలో అమలు చేయకపోతే జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు వేలాదిమంది గీత కార్మికులతో మహా ధర్నా చేపట్టాలని జూన్ 29, 30 తేదీలలో జనగామలో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం కార్యకర్తల రాష్ట్ర చైతన్య సభలలో నిర్ణయించారు. సభ్యులందరికి బైకులు, సేఫ్టీ మోకులు, కుల వృత్తిదారులకు ప్రభుత్వం చేస్తామన్న లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేయాలని సొసైటీలకు భూమి, కల్లుకు మార్కెట్, నీరా, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు ఐదువేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తీర్మానించారు. ప్రభుత్వం పరిష్కారం చేయని పక్షంలో 10వ తేదీన వేలాదిమంది గీత కార్మికులు ఆందోళనలో పాల్గొనాలని కెజికెఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

## రూ.3 లక్షల ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్



జగిత్యాల రూరల్ జూన్ 30 (ప్రజామంటలు): మండలము అంతర్గాం గ్రామానికి చెందిన ఉరుమట్ల గంగాధర్ కూతురు అనూష కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కిడ్నీ మార్పిడి అవసరం కాగా స్థానిక గ్రామ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం 3 లక్షల ఎల్‌ఓసి ని అనూష కుటుంబ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఎల్‌ఓసి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కి అనూష కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి నారాయణ ఉన్నారు.

## తానా మహాసభ లకు డా. వకుళాభరణంకు ఆహ్వానం



హుజురాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): అమెరికా లోని ఫిలడెల్ఫియాలో జులై 7, 8, 9 తేదీలలో నిర్వహిస్తున్న తానా మహాసభ లకు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు కు ఆహ్వానం అందింది. ఈ సభలలో జరిగే ప్రధాన కార్యక్రమాల్లో డాక్టర్ వకుళాభరణం ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు. కరోనా పరిణామాల అనంతరం ఈ సారి ప్రత్యక్షంగా జరుగబోయే ఈ మహాసభ లను తానా ఘనంగా నిర్వహించనున్నది. కాగా అమెరికాలో నిర్వహించే తానా సభలలో కూడా డాక్టర్ కృష్ణమోహన్ ను ప్రత్యేకంగా సన్మానించనున్నారు. ఈ అమెరికా పర్యటనలో భాగంగా హూస్టన్, డల్లాస్, న్యూయార్క్, న్యూజెర్సీ, చార్లెట్ మున్నగు ప్రాంతాలలో జరిగే ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాలు, అభినందన సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. జూలై 2 న, ఉదయం 4 గంటలకు బయలుదేరి వెళ్లనున్న డాక్టర్ వకుళాభరణం జూలై 24 వ తేది వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మూడు వారాల పాటు అమెరికా లో పర్యటించడానికి డాక్టర్ వకుళాభరణం కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 1న రవీంద్ర భారతిలో "తానా" నిర్వహించిన బహుజన ఉత్సవాలలో డాక్టర్ కృష్ణ మోహన్ కు "బహుజన బంధు పురస్కారం" ను అందజేసిన విషయం తెలిసిందే.

# మద్దతు ధరల మర్మం !

కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది. రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు.


అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో

ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య్ర వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి. అంతేకా కుండా... ఆదాయవనరుగా తీర్చిదిద్ది నిరుద్యోగాన్ని నిర్మూలించేలా చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించాలి. అప్పుడే వ్యవసాయం బతికిబట్ట కలదు. తాజాగా చెరుకుకే కాకుండా మిగతా పంటలకు కూడా మద్దతు ధరలను పెంచాలి.

# వైద్యుడు ప్రత్యక్ష దైవం

## నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కోల్‌కతా,జూన్30 : వైద్యో నారాయణో హరిః అన్నది ఆర్యోక్తి. వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడితో సమానం. ఎందుకంటే ప్రాణాపాయం నుంచి మనలను గట్టెక్కించేది అతడే గనుక. మనం భూమి మీద రావడానికి ముందే డాక్టర్ సహాయం అవసరమవుతుంది. మనం పుట్టి, పెరిగి పెద్దయ్యాక కూడా వైద్యుని సహకారం ఖచ్చితంగా ఉంటుంది. అందుకే వైద్యోనారాయణ హరి అని అంటుంటారు పెద్దలు.. మనకు ఏ చిన్న రోగమొచ్చినా దాన్ని చిటికెలో నయం చేసే ఆపద్బాంధవుడు వైద్యుడే. మనలో ఎవరికైనా ప్రాణాపాయం కలిగినప్పుడు మన ప్రాణాల్ని కాపాడేందుకు శాయశక్తులా కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అంతేకాదు మనలోని మానసిక స్థితిని బట్టి, మన ప్రవర్తనకు తగ్గట్టు వ్యవహరిస్తారు. మనకు ఎలాంటి బాధ కలగకుండా మనకు చికిత్స చేసేందుకు ప్రయత్నం చేస్తారు. మనం వ్యాధి నుండి త్వరగా కోలుకునేలా చేస్తారు. ఒకవేళ మనం వ్యాధి నుండి బయటపడలేని స్థితిలో ఉంటే, మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు వారి వంతు ప్రయత్నం చేస్తారు. ఇంతటి గొప్ప యోధులని గుర్తు చేసుకునేందుకే డాక్టర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ వైద్య దినోత్సవాన్ని డాక్టర్ బిధన్ చంద్ర రాయ్ జయంతి రోజునే జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ బిధన్ చంద్ర రాయ్‌ను స్మరించు కునేందుకు జులై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని, 1991 సంవత్సరంలో కేంద్రం నిర్ణయించింది. ఆయన ఒక గొప్ప వైద్యుడు, విద్యావేత్త, స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. శాసన ఉల్లంఘన ఉద్యమంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బిదన్ చంద్ర రాయ్, పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. వైద్య రంగంలో ఎన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. తన జీవితాన్ని



వైద్యరంగానికి అంకితమిచ్చారు. జులై ఒకటో తేదీన ఆయన జన్మించారు.. అయితే అదే రోజున ఆయన మరణించడం విశేషం. అందుకే మనదేశంలో ఆయన జ్ఞాపకార్థం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆయన వైద్య రంగంలోనే కాదు, రాజకీయాల్లో చాలా కీలక పాత్ర పోషించారు. 1947 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా కూడా పని చేశారు. 1948 సంవత్సరంలో జనవరి 23వ తేదీన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సామాన్య ప్రజలకు సైతం వైద్యం అందుబాటులో ఉండేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. కలకత్తాలో అనేక మెడికల్ కళాశాల లను ఏర్పాటు చేశారు. అంతేకాదు తను కలకత్తా కార్పొరేషన్ మేయర్ గా ఉన్న సమయంలో ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, మంచి రోడ్లు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూశారు. బెంగాల్ సిఎం అయ్యాక లా అండ్ ఆర్డర్ పై కూడా పూర్తిగా పట్టు సాధించారు. 1961లో తన ఇంటిని కూడా పేద ప్రజల కోసం విరాళంగా ఇచ్చేశారు. అదే ఏడాది అంటే 1961 ఫిబ్రవరి 4వ తేదీన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించింది.



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

# రైతులందరికీ కిసాన్ పథకం వర్తించాలి

## ఆత్మహత్యల నిరోధనానికి పూనుకోవాలి



న్యూఢిల్లీ,జూన్30 : దేశంలో 90 కోట్లకు మించి రైతు కుటుంబాలు వున్నట్లుగా ఓ అంచనా ఉంది. ప్రధాని కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు సమాన వాయిదాల్లో రూ. 6000 నగదు ఇచ్చే పథకం అమలు చేస్తున్నారు. అయితే కేవలం 10.74 కోట్ల కుటుంబాలకే ఇది అందుతున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేవలం 10 శాతం రైతు కుటుంబాలే ఈ కనీస లబ్దిని పొందుతున్నాయి. 2016లో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పరిమిత సంఖ్యలోని రైతులకే వర్తిస్తున్నది. రైతుల కోసం ఉద్దేశించిన 17 పథకాలకు 202021 ఆర్థిక సంవత్సరంలో రూ. 17,540 కోట్లు కేటాయించగా, అందులో రూ. 5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే మొత్తం బడ్జెట్ కేటాయింపులో 33శాతం మాత్రమే ఖర్చు అయింది. ఇందులో మూడు పథకాల కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని సమాచారం. రైతు సంక్షేమం కోసం ఆచరణలో ఇంత తక్కువ స్థాయి కృషి జరుగుతున్నప్పుడు వారి ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందో అర్థం కాని విషయం. 2019లో దేశ వ్యాప్తంగా కనీసం 5,957 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకి సగటున 16 మంది రైతులు ప్రాణత్యాగం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014 నుంచి 2020 వరకు గల ఆరు సంవత్సరాల్లో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా జరిగినట్టు వెల్లడైంది. 2018లో 5,763 మంది, 2017లో 5,955 మంది, 2016లో 6,270 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. దీనిపై కారణాలు వెతికి ఆత్మహత్యలను నిర్మూలించే చర్యలకు ఉపక్రమించడం లేదు. దీంతో వ్యవసాయంలో కాలం కలసిరాకనో..పంటలు పండినా మద్దతుధరలు లేకనో..చేసిన అప్పులు తీర్చలేక రైతులు బలవన్మరణా లకు పాల్పడుతున్నారు. వీటిపై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది.

# నేటినుంచి కొలకనూరి ఇనాక్ సాహితీ సప్తాహం

## త్యాగరాయ గానసభలో వారంపాటు ఉత్సవం

హైదరాబాద్,జూన్30:ప్రముఖ సాహితీవేత్త శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ జన్మదినం సందర్భంగా త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో నేటినుంచి సాహితీ సప్తాహం నిర్వహించనున్నారు. జూలై 1నుంచి 7వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కళా సుబ్బారావు కళావేదికపై నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఇనాక్ త్యాగరాయగానసభతో ఎంతో అనుబంధం ఉందని ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టత దృష్టిలో ఉంచుకొని సాహిత్య సప్తాహం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు రోజుకొకటి ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం(పరిశోధన), వలస(నవల), ది క్కులేనోడు (నాటిక) విశాల శూన్యం(కవిత్వం), విమర్శిని(విమర్శ), పొలి(కథానిక), ఆల్మ్ ఆఫ్ పార్డన్(అనువాదం) గ్రంథావి ష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారీ, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, ప్రము ఖ సాహితీవేత్త నందిని సిద్దారెడ్డి, శాసన సభ తొలి సభాపతి ఎస్.మధుసూధనాచారీ, మా జి మంత్రి మండలి బుధ ప్రసాద్, గ్రంధాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆవిష్కరిస్తారని తెలిపారు. వివిధ రంగ ప్రముఖులు అతిథులుగా ప్రతి రోజు హాజరు అయ్యే కార్యక్రమాలకు తొలుత సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




“ప్రజా మంటలు” తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని “యూ ట్యూబ్ “ లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విష యాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.coఎకు పంపవచ్చు.. -ఎడిటర్

# మార్పు



కొత్తపేట అనే గ్రామం లో కొండయ్య అనే రైతు ఉండేవాడు.తన పొలంలో అనేక పంటలు పండించి, వాటిని పట్టణంలో అమ్మి జీవనం సాగించేవాడు. కొండయ్యకు ఇద్దరు కుమారులు,వారిని పట్టణంలో ఉన్నత చదువులు చదివించాడు.వారు మంచి ఉద్యోగంలో స్థిరపడ్డారు. ప్రతి నెల కొండయ్యకు కుమారులు డబ్బు పంపేవారు.ఆ డబ్బుతో కొండయ్య సుఖమైన జీవితానికి అలవాటు పడ్డాడు.వ్యవసాయంచేయడం పూర్తిగా మానుకున్నాడు.అదే గ్రామంలో కొండయ్యకు,నరసయ్య అనే మంచిమిత్రుడు ఉండేవాడు. తన మిత్రునిలో వచ్చిన మార్పును గమనించాడు నరసయ్య. ఎలాగైన తనలో మార్పు తేవాలని అనుకున్నాడు. ఒక రోజు నరసయ్య కొండయ్య ఇంటికి వచ్చాడు.మిత్రుని రాక కొండయ్యకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. నరసయ్య కొండయ్యతో నీ పొలం మొత్తం బీడుగా పెట్టావని విన్నాను. దీని వల్ల ఎంతో మంది కూలీలకు ఉపాధి లేకుండా పోతుంది.ప్రతి రైతు నీలా కుమారులు పంపిన డబ్బుతో సుఖ జీవనానికి అలవాటుపడి వ్యవసాయం మానుకుంటే, పంటలు పండించే వారు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతారు. తినడానికి తిండి ఉండదు. ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోమని చెప్పాడు.కొండయ్య పై మిత్రుని మాటలు ఎంతో ప్రభావం చూపించాయి.మరుసటి రోజు కొండయ్య తెల్లవారుజామున లేచి మునుపటిలా పొలం పనికి వెళ్ళాడు.పంటలు పండించాడు.ఉత్తమ రైతుగా ఎదిగాడు.గ్రామ ప్రజల మన్ననలు పొందాడు.నరసయ్య తన మిత్రునిలో వచ్చిన మంచి మార్పుకు ఎంతో సంతోష పడ్డాడు.

దాసరి చంద్రమోహన్, ఎన్ తిమ్మాపురం,
అనంతరం,9441497552

# పెద్ద మనుషులు

గంగారము గ్రామంలో ఎల్లయ్య అనే రైతు ఉన్నాడు.అతనికి ఐదు ఎకరాల పొలం ఉన్నది.ఎల్లయ్య కు ఇద్దరు కొడుకులు ఉన్నారు.పెద్దకొడుకు పేరు రవి.పొలం పనులు చేస్తూ,మొక్కలు నాటే పని కూడా చేస్తున్నాడు.రవికి పెళ్లి అయింది.ఒక కొడుకు,ఒక బిడ్డ ఉన్నారు.ఎల్లయ్య చిన్న కొడుకు పేరు రాజు.రాజు బర్రెలతో పాల వ్యాపారం చేస్తున్నాడు.రాజుకి కూడా పెళ్ళి అయింది.ఇద్దరు కొడుకులు.కొన్ని రోజుల తర్వాత రవి,రాజు కుటుంబాలు వేరు పడ్డాయి.ఎల్లయ్య ,ఇద్దరు కొడుకులకు చెరి సగం పొలం పంచి ఇచ్చాడు.

రవి, రాజు ఇల్లు ను పంచుకుని, ఎల్లయ్య కు రేకుల ఇల్లు కట్టించి ఇచ్చారు. కొన్ని నెలల తర్వాత రాజు తనకు భూమి ఎక్కువ రావాలని అన్న రవితో గొడవ పెట్టుకున్నాడు. గొడవలు పెద్దకాగానే ఎల్లయ్య గుండెపోటుతో చనిపోయాడు. రవి, రాజుల పంచాయితీ కోసం పెద్ద మనుషుల దగ్గరి కి వెళ్ళారు. పెద్ద మనుషులు పంచాయితీ వాయిదా వేస్తూనే ఉన్నారు. పంచాయితీ ఖర్చుల కోసం అన్నదమ్ములు చెరి ఎకరం పొలం అమ్మినారు. పదేళ్ళయింది.ఇంకా పంచాయితీ అయిపోలేదు. అప్పుడు అన్నదమ్ములు రవి,రాజు లకు బుద్ధి వచ్చింది. తమ తప్పులు తెలుసుకుని కలిసిపోయారు.

- దాసరి ప్రసన్న కుమార్
ఏడవ తరగతి, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా

# ఉమ్మడి పౌరస్మృతికి వేగంగా అడుగులు

- ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పెట్టే ప్రయత్నాలు
- బిజెపి వేస్తున్న అడుగులపై అనేక అనుమానాలు

న్యూఢిల్లీ,జూన్30 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లు ను వచ్చే నెలలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించబోతోంది. వివిధ వర్గాల వాదనలను ఈ సంఘం స్వీకరిస్తుంది. అత్యున్నత స్థాయి విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయినా ఎన్నికలకు ముందే దీనిని మమ అనిపించాలని చూస్తున్నట్లు సమాచారం.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని, వివిధ వర్గాల వాదనలను ఆ కమిటీ స్వీకరిస్తుందని ప్రచారం సాగుతోంది. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవల లా కమిషన్, న్యాయ మంత్రిత్వ శాఖల ప్రతినిధులకు నోటీసులు ఇచ్చింది. జూలై 3న హాజరు కావాలని ఆదేశించింది. ఉమ్మడి పౌర స్మృతిపై అభిప్రాయాలను తెలియజేయాలని కోరుతూ లా కమిషన్ జూన్ 14న జారీ చేసిన నోటీసు నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ నోటీసులను జారీ చేసింది. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం షెడ్యూలు ప్రకారం, లా కమిషన్, లీగల్ అ్గ÷ర్స్, న్యాయ మంత్రిత్వ శాఖలలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరి స్తుంది. 'వ్యక్తిగత చట్టాల సమీక్ష' అంశంపై లా కమిషన్ వివిధ వర్గాల అభిప్రాయాలను కోరిన నేపథ్యంలో స్థాయీ సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మూడో వారం నుంచి ప్రారంభం కావచ్చు. పాత పార్లమెంటు భవనంలో కొన్ని రోజులు సమావేశాలు జరిగిన తర్వాత, నూతన పార్లమెంటు భవనానికి మారే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాలవారికి, ప్రతి ఒక్కరికీ ఒకే చట్టం అమలు కావాలని చెప్పారు. ఈ సున్నితమైన అంశంపై ముస్లింలను కొందరు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. యూసీసీని తీసుకురావాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నవారు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒక దేశం రెండు రకాల వ్యవస్థలను ఎలా అమలు చేయగలదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో యూసీసీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికరణ 44 కూడా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని చెప్తోంది. మోదీ వ్యాఖ్యలతో యూసీసీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆమ్ ఆద్మీ పార్టీ సూత్రప్రాయంగా మద్దతు తెలుపగా, కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాకాండ వంటి సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తు తున్నారని దుయ్యబడుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి అంశాల్లో దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులకు వేర్వేరు వ్యక్తిగత చట్టాలు అమలవుతున్నాయి. హిందూ చట్టాల ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కులు పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉన్నాయి. క్రైస్తవులకు వర్తించే చట్టం ప్రకారం క్రైస్తవ మహిళలకు ముందుగా నిర్ణయించిన వాటా మాత్రమే లభిస్తుంది. పిల్లలు, ఇతర బంధువులు ఉండటాన్నిబట్టి ఈ వాటా ఉంటుంది. పారశీక మతానికి చెందిన మహిళ తన భర్త మరణించినట్లయితే, తన పిల్లలతో సమాన వాటాను పొందవచ్చు. ముస్లిం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషులకు లభించే వాటాలో సగం లభిస్తుంది.

## భక్తి శ్రద్ధలతో శ్రీ సాయి అష్టలక్ష్మీ సేవ



సికింద్రాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): పద్మారావునగర్ లోని శ్రీసాయి వ్యాధి నివారణ ఆశ్రమ్ శ్రీ సాయిబాబా ఆలయంలో జరుగుతున్న శ్రీ సాయి సప్తాహ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో శ్రీసాయి అష్టలక్ష్మీ సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసాయి అష్టలక్ష్మీ సేవ పూజలో వందలాది మంది మహిళలు పాల్గొని, అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో సద్గురు శ్రీసాయి కుమార్, కార్యదర్శి బి. చల్వరాయ్, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

## సాయి చందు కు ఘన నివాళి



కొడిమ్యాల జూన్ 30 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొడిమ్యాల కడ మెడ కలసాహితి, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచందు కు ఘన నివాళి అర్పించడం జరిగింది ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... సాయి చందు మరణం తెలంగాణ రాష్ట్రనికి, కళా రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడ మెడ కళ సాహితి అధ్యక్షుడు మల్లారపు రాజు, ప్రధాన కార్యదర్శి ఇనుగంటి సత్యనందం, అంబేద్కర్ సంఘ సభ్యులు రామంచ లక్ష్మణ్, పర్లపెల్లి ప్రభుదాస్, పెంట మల్లేశం, కొత్తూరి శంకర్, కొత్తూరి స్వామి, లింగంపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి లయన్స్ క్లబ్‌కు మైల్స్ స్టోన్ అవార్డు




ధర్మపురి జూన్ 30 (ప్రజామంటలు): ధర్మపురి లయన్స్ క్లబ్ కు 2022-2023 సంవత్సరంకు గాను 320-జి రీజియన్ నందు అత్యధిక మంది సభ్యులను చేర్చినందుకు ఆ సంవత్సరానికి అధ్యక్షుడిగా వ్యవహరించిన డాక్టర్ రామకృష్ణ కు ఈ యొక్క అవార్డును ప్రధానం చేయడం జరిగింది. అవార్డు ప్రధాన కార్యక్రమంలో లయన్ జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ కోదండరాం, జిల్లా సెక్రెటరీ మధుసూదన్, జిల్లా సెకండ్ సెక్రటరీ రమణారెడ్డి, ఆర్.సి. గట్టు రాజయ్య, జోనల్ చైర్ పర్సన్ భీమనాతి అశోక్, లయన్ జిల్లా మెంబర్ జక్కు రవీందర్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పిన్న శ్రీనివాస్, సంగి ఆనంద్, తదితర లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కుల వివక్ష సమాజానికి గొడ్డలి పెట్టు లాంటిది



గొల్లపెల్లి జూన్ 30 (ప్రజామంటలు): ఆధునికత వైపు జెట్ స్పీడ్ వేగంతో పరుగులు తీస్తున్న ప్రస్తుత సమాజంలో కొన్నిచోట్ల కుల వివక్షను పాటించడం సమాజాభివృద్ధికి గొడ్డలి పెట్టు లాంటిదని ఆర్.ఐ. రాణి పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండలం చెందోలి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వివక్ష పాటించడం పట్ల ఏర్పడే దుష్ఫలితాలు గూర్చి, వాటి పట్ల ఏర్పడే పరిణామాల గూర్చి గ్రామ సభ నిర్వహించి అవగాహన కల్పించారు. మానవులంతా సమానమే అని కుల, వర్ణ, వర్గ విభేదాలన్ని మానవులు ఏర్పచుకున్న సామాజిక రుగ్మతలని వాటిని వీడనాడి అందరూ సమానమనే భావంతో మెలగాలని ఆర్ఐ రాణీ సూచించారు. కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమని వాటిని పాటించేవారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తప్పవని ఏఎస్సై హెచ్చరించారు. అనంతరం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో దళితులచే ఆలయ ప్రవేశం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా సామూహిక అల్పాహార విందు సేవించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలిశెట్టి రవీందర్, ఉప సర్పంచ్ కట్కూరి రమేష్ ,కార్యదర్శి మణికంఠ, గ్రామస్తులు పాల్గొన్నారు.



జనగామ వీవర్స్ కాలనిలో వీవర్స్ సర్వీసు సెంటర్ చే 45 రోజుల సమ్మర్ ట్రైనింగ్ ప్రారంభం. పాల్గొన్న వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి పి ఆర్ ఒ శ్రీనివాసులు, 12వ వార్డ్ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మీ, చేనేత సహకార సంఘం అధ్యక్షులు గుర్రం నాగరాజు.

# నేటి గ్రూప్ 4 పరీక్ష కు అన్నీ ఏర్పాట్లు పూర్తి

### పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



హనుమకొండ జూన్ 30 (ప్రజామంటలు): జిల్లా వ్యాప్తంగా జూలై 1 న జరగనున్న గ్రూప్ 4 పరీక్ష కు అన్నీ ఏర్పాట్లు పూర్తయినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వచ్చే అభ్యర్థులెవరు కూడా సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకుండా జాగ్రత్త పడాలని, అభ్యర్థులను ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని తెలిపారు. ఒక వేళ ఫోటో లేకుండా హల్ టికెట్ వచ్చినట్లయితే 3 పాస్పోర్ట్ పోటోలతో అటెస్టేషన్ చేయించుకొని వచ్చిన వారిని కూడా పరీక్షకు అనుమతిస్తామన్నారు. జులై 1వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు పేపర్-%×%, మధ్యాహ్నం 2:30 నుండి 5.00 గంటల వరకు పేపర్ - 2 పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 47,978మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు, అందుకుగానూ మొత్తం 161పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 32 రూట్లలో 32 మంది రూట్ ఆఫీసర్ల ను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిరాక్స్ సెంటర్లను మూసి వేయడం జరుగుతుంది అని అన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేకాధికారులను నియమించడం జరిగింది అని అన్నారు. తెలుగులో 47828 అభ్యర్థులు 145 ఉర్దూలో పరీక్ష రాయనున్నారని, ఇందులో 753 మంది ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ అభ్యర్థులు 101 మంది స్క్రైబ్ లు ఉన్నారని ఆమె తెలిపారు. గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థిని ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రంలోకి అనుమతించరని, అభ్యర్థులు ముందుగానే తమ కేంద్రం ఎక్కడుందో తెలుసుకుని త్వరగా చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

# నిరసనల హోరు...పాత మండలమే ముద్దు

### ఐదు గ్రామాల ప్రజల భారీ ర్యాలీ..ఆర్డీవో కు వినతి



మెట్ పల్లి జూన్ 30 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా మెట్ పల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మెట్ పల్లి మండలంలో ఉన్న బండలింగాపూర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ ఇటీవల ప్రకటించింది. అయితే ఏవైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలుపాలని గెజిట్లో పేర్కొంది. బండలింగాపూర్ గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఐదు గ్రామాలైన జగ్గాసాగర్, ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్క పేట, పాటిమీది తండాల ప్రజలు నిరసిస్తూ మెట్ పల్లి లోని వ్యవసాయ మార్కెట్ ఆవరణ నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ గ్రామాలను మెట్ పల్లి మండలంలోనే కొనసాగించాలని, కొత్త మండలంగా ప్రకటించిన దానిలో చేర్చవద్దని మెట్ పల్లి తమ గ్రామాలకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఐదు గ్రామాల ప్రజల నినాదాలతో దద్దరిల్లిపోయింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వినోద్ కుమార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. తమ గ్రామాలను మెట్ పల్లి మండలంలోనే కొనసాగించాలని కొత్త మండలంలో చేర్చవద్దని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

# పరిమళించిన మానవత్వం

### సామాజిక మిత్రుల ఔదార్యం..బాధితులకు రూ. 1.21 లక్షలు సాయం

### రామ కిష్టయ్య సంగన భట్ల



ధర్మపురి జూన్ 30 (ప్రజామంటలు): తీవ్ర అనారోగ్యాలకు గురై, వైద్యం చేయించుకోలేని స్థితిలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇరువురి బాధితులకు మానవత్వం పరిమళించిన వేళ సామాజిక మిత్రులు రూ. 1.21 లక్షలు అందించి ఔదార్యం చాటుకున్న వైనమిది. ధర్మపురి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మసీదు లక్ష్మి , శంకర్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు. శంకర్ అనారోగ్య కారణంతో కొన్ని సంవత్సరాల పాటు ఇంట్లోనే ఉంటూ ఇటీవల కోలుకున్నాడు. దాంతో లక్ష్మి కూలి పని చేస్తూ, కుటుంబ పోషణ తో పాటు పిల్లల్ని చదివిస్తూ వచ్చింది. ఏడాది క్రితం లక్ష్మికి క్యాన్సర్ వ్యాధి సోకడంతో ఆరోగ్యశ్రీ ద్వారా కొన్నిసార్లు కీమోథెరపీ చేయించుకోవడం జరిగింది. ప్రస్తుతం వైద్య పరీక్షలకు, మందులకు తీవ్ర ఇబ్బందుకు గురవుతోంది. అలాగే బుగ్గారం మండలం యశ్వంత్ రావు పేట గ్రామానికి చెందిన బోయిని చిన్న లక్ష్మి, గంగన్న వృద్ధ దంపతులు పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసరా పెన్షన్ తోనే బ్రతుకు బండి లాగుతుండగా, ఏడాది క్రితం చిన్న లక్ష్మికి రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్ కోసం ఓ పైపు అమర్చడానికి దాతల సాయంతో సర్జరీ చేయించారు. వారానికి రెండుసార్లు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటుండగా ప్రయాణ ఖర్చులు, మందుల కొనుగోలు భారంగా మారాయి. వీరి పరిస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి వీరి వైద్యం కోసం సాయం అందించాలని జూన్ 4న ఫేస్ బుక్ లో పోస్ట్ చేశాడు. ఎన్నారైలు, ఇతర దాతలు లక్ష్మీ బ్యాంకు ఖాతాకు రూ. 1.21 లక్షలు విరాళాలు పంపించారు. దాతలందించిన విరాళాలను రమేష్ స్థానిక సీఐ రమణ మూర్తి చేతుల మీదుగా క్యాన్సర్ బాధితురాలుకు రూ. 75 వేలు, కిడ్నీ బాధితురాలుకు రూ. 46 వేలు పంపిణీ చేయించాడు.

# గాంధీ ఆసుపత్రి పేషంట్లకు ఇచ్చే ఫుడ్డు మెను ఇదీ...

### పెరిగిన ధరలతో ఇక నాణ్యమైన ఆహారం




సికింద్రాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రిలో పెరిగిన డైట్ ఛార్జీల ప్రకారం పేషంట్లకు ఇచ్చే ఆహారం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. గతంలో రూ 40 లు ఉండగా, అది ఇప్పుడు రూ. 80 కి పెరిగింది. గతంలో పేషంట్లకు 3 పూటలు ఇచ్చే ఫుడ్డుకు ప్రభుత్వం కేవలం రూ 40 మాత్రమే చెల్లించేది. కాని ఇప్పుడు డైట్ ఛార్జీలు డబుల్ అయ్యాయి. డ్యూటీ డాక్టర్లకు రూ 80 నుంచి రూ 160, పోస్ట్ ఆపరేటివ్ పేషంట్లకు ( హై ప్రోటీన్ డైట్ ) రూ 56 నుంచి రూ 112 కు పెంచారు. మారిన ఛార్జీలతో పాటు మెనూలో కూడ మార్పులు చేశారు. ఇదే కాకుండా కేంద్ర ప్రభుత్వం పథకం జేఎస్ఎస్కే (జననీ శిశు సురక్ష కళ్యాణ్ యోజన) కింద పౌష్టిక ఆహారాన్ని గర్భిణీలు, ప్రసవం అయిన మహిళలకు అందచేస్తారని గాంధీ ఆసుపత్రి చీఫ్ డైటీషియన్ రమేశ్ తెలిపారు. ఇప్పటి నుంచి పేషంట్లకు నాణ్యమైన ఫుడ్డు అందనుంది. ఇటీవల నిర్వహించిన టెండర్ లో డైట్ క్యాంటీన్ నిర్వహణ హక్కులు దక్కించుకున్న శ్రీ వెంకటేశ్వర అసోసియేట్స్ సంస్థ కొత్త రేట్లతో కూడిన ఆహారాన్ని పేషంట్లు, డాక్టర్లకు అందిస్తోంది.

ప్రతిరోజు పేషంట్లకు ఇచ్చే జనరల్ ఫుడ్డు మెనూ ఇది..ఉదయం 7.30 నుంచి 8.30 వరకు అల్పాహారంలో ఉప్మా, పొంగల్, కిచిడి, ఇడ్లీ, (ఇందులో రోజుకో రకం) టీ, బాయిల్డ్ ఎగ్.మధ్యాహ్నం లంచ్ లో అన్నం, వెజ్ కర్రీ, పాలు, ఆకుకూర పప్పు, సాంబారు, గుడ్డు, అరటిపండు, పెరుగు. రాత్రి భోజనంలో అన్నం, పుల్కాలు, వెజ్ కర్రీ, ఆకుకూర పప్పు, సాంబారు, గుడ్డు, పెరుగు, అరటిపండు ఇస్తారు.

పోస్టు ఆపరేటివ్ పేషంట్లు తొందరగా కోలుకునేందుకు ఇచ్చే హై ప్రోటీన్ డైట్:

అల్పాహారం కింద ఇడ్లీ, పొంగల్, పాలు, గుడ్డు, అరటిపండు, లంచ్ లో అన్నం, పుల్కాలు, కూరగాయ, ఆకుకూర పప్పు, సాంబారు, పెరుగు, గుడ్డుటీ విరామంలో పాలు, పల్లి చెక్కి లేదా రాగి జావ...రాత్రి భోజనంలో అన్నం, పుల్కాలు, కూరగాయ, సాంబర్, పెరుగు, అరటిపండు, గుడ్డు ఇస్తారు.

## వచ్చే ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్.కు తగిన గుణపాఠం

### కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోవడం సరికాదు

### ఆలిండియా కోలీ సమాజ్ నేతలు




సికింద్రాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముదిరాజ్ లు అంతా సమిష్టిగా కలసి తగిన గుణపాఠం చెబుతామని ఆలిండియా కోలీ ( ముదిరాజ్) సమాజ్ నాయకులు హెచ్చరించారు. సోమాజీగూడ ప్రెస్క్లబ్ లో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముదిరాజ్ నేతలు మాట్లాడుతూ..ముదిరాజ్ జాతిని నానా దుర్భాషలాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై ఇప్పటివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం గాని సీఎం కేసీఆర్ గాని ఎలాంటి చర్యలు తీసుకోనందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అకారణంగా ముదిరాజ్ ల జోలికి ఎవరు వచ్చినా వారికి తమ తడఖా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత కోలీ సమాజ్ ఉపాధ్యక్షులు రొట్టం భూపతి ముదిరాజ్ , తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెప్పరి శంకర్ ముదిరాజ్, అఖిలభారత కోలీ సమాజ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, సంతోష్ కుమార్, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస రాజ్, మాజీ కార్పొరేటర్ శ్రీదేవి రమేశ్, సుప్రీంకోర్టు న్యాయవాది రమేశ్, హనుమంతరావు, అశోక్, కోట్ల పుష్పలత, నాగరాజు పాల్గొన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్ రిపేరింగ్ షెడ్ లో కాపర్ వైర్ చోరీ



మెట్ పల్లి జూన్ 30 (ప్రజామంటలు): పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ రిపేరింగ్ షెడ్డు లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు వెనక ఉన్న కిటికీ ఊచలు కోసి లోపలికి చొరబడి 600 కిలోల కాపర్ వైరు దొంగిలించారు. దీని విలువ సుమారు 1 లక్ష 80 వేలుగా గుర్తించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలుసుకొనుటకు జగిత్యాల ఎస్ఈ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించారు. మెటుపల్లి డివిజన్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ మొత్తం 18 ట్రాన్స్ ఫార్మర్ లు చోరికి గురైనట్లు, సంస్థకు సుమారు నాలుగు లక్షల నష్టం జరిగినట్లు తెలిపారు. ఈ విషయంలో మెటుపల్లి, కోరుట్ల సీఐ లు లక్ష్మినారాయణ, ప్రవీణ్ కుమార్ లతో ఎస్ఈ సమావేశమై చర్చించారు. రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ప్రస్తుత తరుణంలో ట్రాన్స్ఫార్మర్ చోరీ జరిగితే పంటలు దెబ్బతింటాయని, రైతులు కూడా విద్యుత్ సిబ్బందికి అనుమానితుల సమాచారం అందించి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ లు మాట్లాడుతూ దర్యాప్తు వేగవంతం చేశామని, అనుమానితుల జాబితా పరిశీలిస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుని శిక్ష విధింపజేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెటుపల్లి ఏడీఈ మనోహర్, ఏడీఈ అనిల్ కుమార్, ఏఈ లు ప్రదీప్, రవి పాల్గొన్నారు.

## దేవస్థానానికి రూ. 60.96 లక్షల హుండీ ఆదాయం




ధర్మపురి జూన్ 30 (ప్రజామంటలు): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 33.21 లక్షల హుండీ ఆదాయం లభించింది. శుక్రవారం దేవస్థానం లోని వివిధ ఆలయాలలో ఉన్న హుండీలను 24-03-2023 నుండి 30-6-23 వరకు 98 రోజులకు సంబంధించి విప్పి లెక్కించగా మొత్తం ఆదాయము 60,96,035 లు నగదు రూపంలో లభించాయి. మిశ్రమ బంగారము 53.00 గ్రాములు, మిశ్రమ వెండి 9 కిలోల 850 గ్రాములు, మరియు విదేశీ నోట్లు 52 లభించాయి. దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఎ. చంద్రశేఖర్, సహాయ కమీషనర్, దేవాదాయశాఖ, కరీంనగర్ గారు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస్ , దేవస్థాన పునరుద్దరణ కమిటీ చైర్మన్ రామయ్య, సభ్యులు గందె పద్మ శ్రీనివాస్, అక్కెనపెల్లి సురేంధర్, కొమురయ్య, చుక్క రవి, స్తంభంకాడి మహేష్, ఇనగంటి రమ వెంకటేశ్వర్ రావు, గునిశెట్టి రవీంధర్, సురేందర్ పల్లెర్ల, వేముల నరేశ్, సంగెం సురేశ్, దేవస్థాన సూపరింటెండెంట్ డి. కిరణ్, ఉప ప్రధాన అర్చకులు నేరళ్ళ శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ ఎ. శ్రీనివాస్, తిరుమల సేవా గ్రూప్ సభ్యులు, కరీంనగర్, ధర్మపురి, లక్షెటిపేట సేవకులు, ఇతరులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, పోలీస్ సిబ్బంది, దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన బీ.ఆర్.ఎస్. నేతలు



సికింద్రాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): బక్రీద్ పండుగ సందర్భంగా పలు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, అండగా నిలిచిన రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ను మారేడ్పల్లిలోని తన నివాసంలో శుక్రవారం పలువురు ముస్లిం పెద్దలు కలసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... బీ.ఆర్.ఎస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అన్ని మతాల వారిని గౌరవిస్తూ, అన్ని మతాల పండుగల నిర్వహణకు ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. విజయవంతంగా ఉన్నత విద్యనభ్యసించిన అస్మాను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు కుర్మ లక్ష్మీపతి, మహ్మద్ అబ్బాస్, షేక్ రుక్మొద్దీన్, మహ్మద్ జుబేర్, షేక్ సాజిద్, అస్మా, మహ్మద్ అరీఫ్ పాల్గొన్నారు.

## వివిధ కుల సంఘాలకు ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలం లోని గ్రామాలకు సంబంధించిన వివిధ కుల సంఘుల భవన నిర్మాణాలకు మంజూరైన రూ. 50,00,000 యాభై లక్షల రూపాయల విలువ గల ప్రొసీడింగ్స్ పత్రాలను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.... ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో కుల సంఘాల అభివృద్ధికి చెందేలా అన్ని కుల సంఘాలకు నిధులు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల జడ్పిటిసి కంఠం రమేష్ - భారతి, ఇబ్రహీంపట్నం మండల ఎంపీపీ జాజాల భీమేశ్వరి-జగన్ రావ్, ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ నేమురి లత సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం మండలం సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్ లు, అధికారులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా రైటర్స్ మీట్ కు బిల్ల మహేందర్ ఎంపిక



హన్మకొండ జూన్ 30 (ప్రజామంటలు): హన్మకొండ, కాలనీ పేజ్-2 కు చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్ కు కేంద్ర సాహిత్య అకాడమీ నుండి ఆహ్వానం అందింది. వచ్చే నెల జూలై 18న ఢీల్లీలో అకాడమీ ఆధ్వర్యంలో జరగబోయే 'ఆల్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ రైటర్స్ మీట్' లో పాల్గొనవలిసిందిగా కోరుతూ ఈ మేరకు అకాడమీ కార్యదర్శి డా. కె. శ్రీనివాసరావు అధికారికంగా సమాచారం అందించారు. వివిధ భాషలలో జరగబోయే సమ్మేళనంలో తెలుగు నుండి మహేందర్ తన కవిత్వాన్ని వినిపించనున్నారు. వేలేరు గ్రామంలో జన్మిం చిన మహేందర్ కవిగా, ఉపాధ్యాయుడిగా, సామాజిక సేవకుడిగా రాణిస్తూనే ఆరు కవిత్వ సంపుటాలతో పాటు తన సంపాదకత్వంలో నాలుగు పుస్తకా లను అచ్చువేశారు. దివ్యాంగుల సాధికారతకోసం కృషి చేస్తున్నం దుకు ఇటీవలనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి అవార్డు అందు కున్నారు. రైటర్స్ మీట్స్ కు అవకాశం కల్పించిన అకాడమీ సభ్యు లకు ఈ సందర్భంగా మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. మహేందర్ ఎంపిక పట్ల ప్రముఖ కవి విఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు, డా. బన్న అయిలయ్య, మహ్మద్ సిరాజుద్దీన్, గురిజాల తిరుపతి రెడ్డి, అస్నాల శ్రీనివాసు తదితరులు హర్షం ప్రకటించారు.

## నిరాహార దీక్ష ను విజయవంతం చేయండి

### మహంకాళి రాజన్న పిలుపు



జగిత్యాల జూన్ 30 (ప్రజా మంటలు): ఆర్యవైశ్య హక్కుల సాధన కోసం తలపెట్టిన నిరాహార దీక్ష కార్యక్రమంను జిల్లాలోని ఆర్యవైశ్య సోదరులు విజయవంతం చేయాలనీ జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు మహంకాళి రాజన్న పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... అన్నీ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఆర్య వైశ్యులను విస్మరించడం తమ సమాజాన్ని ఆవేదనకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, వైష్యులకు రూ.1లక్ష సబ్సిడీ రుణం అందించి ఆర్యవైశ్య సమాజానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జులై 2 న స్థానిక తహసీల్దార్ చౌరస్తా ఆర్డీవో కార్యాలయము ఎదుట మన హక్కుల కోసం తలపెట్టిన నిరాహార దీక్ష కు యావత్ జిల్లా ఆర్యవైశ్య సమాజం కదిలి వచ్చి విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఆయన వెంట పలువురు ఆర్యవైశ్య కులబంధువులు పాల్గొన్నారు.

## గ్రూప్ 4 పరీక్షలకు పకడ్బందీ చర్యలు

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



జనగామ జూన్ 30 (ప్రజామంటలు): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్ 4 పరీక్షల నిర్వహణపై హైదరాబాదు నుండి టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సభ్యులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 1 శనివారం రోజున నిర్వహించే గ్రూప్ ఫోర్ పరీక్షల నిర్వహణ తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై కలెక్టర్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్సో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య పాల్గొన్నారు. అనంతరం వారు పరీక్షలు జరిగే కేంద్రాలు ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల, లింగాల ఘన్పూర్ మోడల్ స్కూల్, ఎస్పీఆర్ స్కూల్, శ్రీ గాయత్రి డిగ్రీ కాలేజ్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బంది చర్యలు తీసుకున్నామని ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించమాని వారితో సమావేశాలు ఏర్పాటు తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు, త్రాగునీరు, భద్రత తదితర అంశాలు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారము తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ ను కూడా ఏర్పాటు చేశామని తెలియజేశారు.

## రవిశంకర్ జన్మదిన వేడుకలు



కొడిమ్యాల జూన్ 30 (ప్రజామంటలు): కొడిమ్యాల మండలంలోని ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బూరుగుపల్లి గ్రామంలో క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగా రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరంల నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్, భారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు భారస పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత దూషణలతో రాజకీయంగా ఎదుగలేవు

### నీకు రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్సే

### బోగ శ్రావణి కి హితబోధ చేసిన డా. చంద్రశేఖర్ గౌడ్



జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు): రాజకీయాల్లోకి కొత్తగా అడుగు పెట్టిన బిజెపి నాయకురాలు శ్రావణి దశాబ్దాల జగిత్యాల రాజకీయ వాతావరణాన్ని వ్యక్తిగత దూషణలతో మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఈ పద్ధతి మార్చుకోవాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ హితబోధ చేశారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇటీవలె ఎమ్మెల్యే సంజయ్ పై బిజెపి నాయకురాలు బోగ శ్రావణి చేసిన ఆరోపణలపై బీఆర్ ఎస్ నాయకులు కౌంటర్ ఎటాక్ చేశారు. ఈ సందర్భంగా డా. చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.... జగిత్యాల రాజకీయ పరిసరాలు గత ముప్పది ఏండ్లకు పైగా గౌరవప్రదముగా ఉన్నాయన్నారు. కానీ ఇటీవలి కాలంలో బిజెపి నాయకుల మూలంగా ప్రజలకు జరగాల్సిన మేలుకంటే వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయ వాతావరణం కలుషితమవుతోందన్నారు. ఇందులోనూ బిజెపి నాయకురాలు బోగ శ్రావణి కేవలం డా. సంజయ్ కుమార్ నే టార్గెట్ చేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందన్నారు. ఇది సరియైన పద్ధతి కాదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, రాజేశం గౌడ్, రమణ వంటి సీనియర్ నాయకులు ఏనాడు వ్యక్తిగత దూషణలు దిగలేదని ఇప్పుడు ఇదో అలవాటుగా మారిందని చంద్రశేఖర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో అధికార పార్టీ తప్పిదాలను నిర్మాణాత్మక రీతిలో విమర్శలు చేయాలని అవికూడా సద్విమర్శలుగా ఉండాలన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తెచ్చిన దరిద్రపు వ్యక్తిగత దూషణల అలవాటు ఇప్పుడు శ్రావణి అమలుచేస్తోందని ప్రతివిషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని డా. చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. పులకేసి అంటూ ఆరోపిస్తున్న శ్రావణి కి మెమో నికు నేము పెట్టి ప్రజల్లోకి తీసుకెళ్లొచ్చని కానీ మేమా రూట్లో పొదలుచుకోలేదని డా. చంద్రశేఖర్ గౌడ్ చెప్పారు. మా పార్టీ బిసిలకు అన్యాయం చేసిందని మాట్లాడుతున్న బోగ శ్రావణి కి రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్ అని మరిచిపోరాదన్నారు. వాస్తవానికి బిజెపి పార్టీ బి.సి. లకు చేసేదేమిటో చెప్పాలని చంద్రశేఖర్ గౌడ్ ప్రశ్నించారు. దేశ ప్రధాని మోడీ బిసి అయి కూడా బిసి కుల గణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి వర్గంలో బిసి మంత్రిత్ర శాఖ ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. శ్రావనికి బీసీలపై ప్రేమ ఉంటే కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని బిసిల సమస్యలపై నిలదీయాలని డా. చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, చేపడుతున్న సంక్షేమ పతకాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వమే పేర్లు మార్చి అమలుచేస్తోందన్నారు. ఇంతకీ బిజెపి పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పతకాలను ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఇప్పుడే అడుగుపెట్టిన బోగ శ్రావణి స్థానిక రాజకీయాన్ని వ్యక్తిగత దూషణలతో కలుషితం చేయడం మానుకోవాలని డా. చంద్రశేఖర్ గౌడ్ హితబోధ చేశారు. పాల్గొన్న బీఆర్ ఎస్ నాయకులు బాల ముకుందం, బీఆర్ఎస్ పట్టణ మహిళ అధ్యక్ష, కార్యదర్శులు కచ్చు లత, శ్రీమంజరి, అర్బన్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గంగాధర్, గుల్లపేట, జాభితాపూర్, వంజరిపల్లి, గొల్లపల్లి సర్పంచులు తిరుపతి, సతీష్, గంగారాం, ప్రకాష్ తోపాటు పోరుండ్ల ఎంపిటిసి తిరుపతి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై శ్రావణి చేసిన ఆరోపణలను ఖండించారు.

## హై లెవెల్ వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలంలోని హైలెవెల్ వంతెన లా నిర్మాణానికి శుక్రవారం రోజున కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంపట్నం-వర్ష కొండ, కోమటి కొండాపూర్- ఎర్దండి, యామాపూర్ - పకిర్ కొండాపూర్, గ్రామాల మధ్యలోగల లో లెవెల్ వంతెనలను హై లెవెల్ వంతెనలుగా నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులకు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... లో లెవెల్ వంతెనల వల్ల ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వర్షం నీరు, వరదనీరులో లెవెల్ వంతెనలపై నుండి ప్రవహించడంతో గతంలో రాకపోకలు సైతం నిలిచిపోయాయని గుర్తు చేశారు. పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పిటిసి కంతం భారతి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తెరసం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జీడి రమేష్ నియామకం



జనగామ జూన్ 30 (ప్రజామంటలు): తెలంగాణ రచయితల సంఘం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జీడి రమేష్ (రీసెర్చ్ స్కాలర్) ను నియమించనున్నట్లు అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ ల ఆదేశానుసారం ఈ నియామకం చేసినట్లు రామమూర్తి వివరించారు. కవిగా, కథకునిగా, పరిశోధకునిగా సాహిత్య ప్రస్థానం కొనసాగిస్తున్న జీడి రమేష్ నియామకం పట్ల జనగామలోని పలు సాహిత్య కళా సంస్థలు అభినందనలు తెలిపాయి.

## బిసిల ఆర్థిక సహాయం తొలుత మేరు కులస్తులకు ఇవ్వాలి



జనగామ జూన్ 30 (ప్రజామంటలు): మేరు కులస్తులు ఆన్ లైన్ లో అప్లై చేసుకున్న వారందరికీ బీసీ కార్పొరేషన్ ద్వారా వచ్చే లక్ష రూపాయల సహాయం తొలుత తమ సామాజిక వర్గానికి ఇవ్వాలని జనగామ మున్సిపాలిటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ రాపర్తి ప్రశాంత్, జనగామ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ అజయ్ కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి రాపర్తి ఆంజనేయులు, జనగామ పట్టణ అధ్యక్షులు రామగిరి శ్రావణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాపర్తి ప్రవీణ్, పట్టణ కార్యదర్శి రాపర్తి కిషోర్, మాజీ మండల అధ్యక్షులు కొత్తకొండ శ్రీనివాస్, మండల అధ్యక్షులు రామగిరి శ్రీనివాస్, పొడిశెట్టి నరేందర్, మాడిశెట్టి నరేందర్, పట్లూరి సతీష్, తాళ్ల అనిల్ కుమార్, గూడూరు సునీల్ పాల్గొన్నారు.

## ముగ్గురు పిల్లలతో కలసి తల్లి ఆత్మహత్య

సిరిసిల్ల,జూన్30 : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో విషాదం చోటుచేసుకున్నది. శభాష్‌పల్లి వంతెన వద్ద మిడ్ మానేరు జలాశయంలో దూకి ముగ్గురు పిల్లలు సహా తల్లి ఆత్మహత్య చేసుకున్నది. మృతుల్లో నాలుగు నెలల పసికందు కూడా ఉన్నది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉన్నది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ముదురుతున్న బిజెపి సీనియర్ల వివాదం

### జితేందర్ రెడ్డి ట్వీట్‌కుఈటెల కౌంటర్



హైదరాబాద్,జూన్30 : బీజేపీ సీనియర్ల మధ్య వివాదం మరింత ముదురుతోంది. బీజేపీ సీనియర్ నేత జితేందర్ రెడ్డికి.. హుజురాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కౌంటర్ ఇచ్చారు. జితేందర్ రెడ్డి ఎందుకు ట్వీట్ చేశారో.. ఆయన ఉద్దేశ్యం ఏంటో ఆయననే అడగాలన్నారు. వయసు, అనుభవం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదీ పడితే అది మాట్లాడకూడదన్నారు. ఎవరి గౌరవానికీ భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. ఎవరి స్వేచ్ఛ, గౌరవం తగ్గించకూడదని ఈటల పేర్కొన్నారు. తెలంగాణ బీజేపీ నాయకత్వానికి ట్రీట్‌మెంట్ అవసరమంటూ ఆ పార్టీ నేత జితేందర్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్నే రేపారు. ఓ చిన్న వీడియో ద్వారా తెలంగాణ నాయకత్వంపై జితేందర్‌రెడ్డి తన అసంతృప్తి నంతా వెళ్లగక్కారు. అసలు ఆ వీడియోలో ఏముందంటే.. ఓ వ్యక్తి దున్నపోతును ట్రాలీలో ఎక్కించడానికి ట్రై చేస్తుంటాడు. అది ఎక్కకుంటే వాటి సీటుపై ఒక్క తన్ను తంతాడు. వెంటనే అది ట్రాలీ ఎక్కుతుంది. సేమ్ టు సేమ్ ట్రీట్‌మెంట్ తెలంగాణ బీజేపీ నాయకత్వానికి కూడా అవసరమని జితేందర్ రెడ్డి ఒక పోస్ట్ పెట్టారు. ఈ ట్వీట్‌ను అమిత్ షా, బీఎల్ సంతోష్, సునీల్ బన్సాల్ లాంటి అగ్రనేతలకు ట్యాగ్ చేశారు.

## పోడు రైతుల గురించి ఆలోచిన నేత కెసిఆర్: నామా

ఖమ్మం,జూన్30 : పోడు భూముల గురించి ఆలోచించిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. పోడు భూముల పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణలో రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. మాయమాటలు చెప్పే వాళ్లను ప్రజలు నమ్మొద్దని చెప్పారు. మనందరం సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని వెల్లడించారు. పాల్వంచలో మంత్రి హరీశ్ రావు గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన రైతులకు పోడు పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సాహితీఫార్మా మృతులకు కోటి చెల్లించాలి

### సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి,జూన్30 : అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలిన ఘటనలో పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి అనే ఇద్దరు కార్మికులు మరణించగా మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా వుంది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సాహితీ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారని పేర్కొన్నారు. రియాక్టర్ పేలి పెద్దఎత్తున మంటలు, దట్టమైన రసాయన వాయువులు కమ్ముకున్నాయని, ఉదయం 11.3గంటలకు రియాక్టర్ పేలితే సాయంత్రం 5 గంటలైనా మంటలు అదుపులోకి రాకపోవడంతో చుట్టప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన లకు గురయ్యారని తెలిపారు.

## వెల్గటూర్ ఎల్ఓ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం



వెల్గటూర్ జూన్ 30 (ప్రజామంటలు): మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధారాణి రామస్వామి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామ్ చంద్రం, పాక్స్ చైర్మన్ రత్నాకర్ మండల సర్పంచ్ లు ఎంపీటీసీ లు బిఆర్ఎస్ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులను వేధిస్తే చట్టపర చర్యలు సర్కిల్ ఇన్స్పెక్టర్ నటేష్ గౌడ్




జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు): వయోవృద్ధులను వేదించేవారిపై పోలీసు శాఖ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జగిత్యాల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిశారు. టోన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ వయోధికుల సమస్యలను సర్కిల్ ఇన్స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.... సీనియర్ సిటీజన్స్ ను వేధింపులకు, దాడులకు గురి చేసేవారి గురించి తమ దృష్టికి తీసుకు వస్తే వారిపై చర్యలు ఉంటాయన్నారు.సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్. దేశాయ్, జిల్లా బి.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు పుల్లూరి సత్యనారాయణ, సతీష్ రాజ్, పడాల శ్రీనివాస్, సీనియర్ సిటీజన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఎండి. యాకూబ్, మానాల కిషన్, నాగుల కిషన్ గౌడ్, సింగం గంగాధర్, కృష్ణ,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యా సంఘ నేత బ్రహ్మన్నగారి బ్రహ్మయ్య మృతి



హైదారాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): ప్రముఖ ఉపాధ్యాయ సంఘ నాయకుడు, బ్రాహ్మణ సంఘ పటిష్టతకు నిరంతరం విశేష కృషి చేసిన బ్రహ్మన్నగారి బ్రహ్మయ్య (94) కోరుట్ల పట్టణంలో స్వర్గస్తులయ్యారు. ఉపాధ్యాయ సంఘ నాయకునిగా రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 6 దశాబ్దాల పాటు ఎంతో కృషి చేశారు. వీరి మరణం పట్ల పలువురు ఉపాధ్యా సంఘ నాయకులు, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు, బ్రాహ్మణ సంఘ నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.బ్రహ్మశ్రీ బ్రహ్మన్నగారి బ్రహ్మయ్య గారి ఆత్మకు వైకుంఠ ప్రాప్తి కలగాలని ఆ శ్రీయఃపతిని ప్రార్థిస్తు...వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తు... బ్రహ్మన్న గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన "ప్రజామంటలు తెలంగాణ జాతీయ దినపత్రిక" ఎడిటర్, జగిత్యాల శాతవాహన్ హై స్కూల్ కరస్పాండెంట్ సి.హెచ్. వి. ప్రభాకర్ రావు.

## ఫార్మా ఘటనపై సమగ్ర విచారణ

### సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయించాలి

### సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్

అనకాపల్లి,జూన్30 : అచ్చుతాపురం ఎస్ ఈ జెడ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. సాహితీ ఫార్మా కంపెనీలో ఈరోజు జరిగిన ప్రమాదంలో భువనేశ్వర్ కి చెందిన డి రమేష్, జంగాల పాలెం చెందిన పైల సత్తిబాబు, విజయనగరం చెందిన నూకినాయుడు, తిరుపతి రేబాకకు చెందిన ఎస్.రాజబాబు, నక్కపల్లికి చెందిన ఎస్.అప్పారావు కొండకోపాకు చెందిన పిల్లా సంతోష్ కుమార్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. ఫ్యాక్టరీలో లోడింగ్ జరుగుతుండగా పేలుడు సంభవించి ప్రమాదం జరిగి ఉదయం 11 గంటల నుండి మంటలు సంభవించాయని పేర్కొంది. దఫ దఫాలుగా పెలుడులు సంభవించడంతో చుట్టుపక్కల ఫ్యాక్టరీలో ఉన్న కార్మికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని తెలిపింది. అధికారులు ఎంతమంది ప్రమాదంలో గాయపడింది స్పష్టంగా తెలియజేయడం లేదని, తరుచూ ప్రమాదాలతో కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కంపెనీలలో ఎటువంటి భద్రత చర్యలు పాటించడం లేదని, ఫ్యాక్టరీ అధికారులు సేఫ్టీ ఆడిట్ చేయకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో కంపెనీలు లాభాలే పరమావధిగా తన ఇష్టానుసారం వ్యవహరిస్తు న్నారని పేర్కొంది. అచ్చుతాపురం ఎస్ ఈ జెడ్ ప్రాంతంలో వందలాది కంపెనీలు ఉన్న దగ్గర కార్మికులకు ప్రమాదం జరిగితే వైద్య సహాయం అందించడానికి కనీసం పడకల ఆసుపత్రి కూడా లేదని, కంపెనీ ప్రమాదంలో గాయపడిన వాళ్లకి అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించడం సరైనది కాదని ఆగ్రహించింది.

# ముంపు గ్రామాల ప్రజలను ముంచేశారు

- నిర్వాసితులను గాలికొదిలేసి నిధులు మెక్కేశారు
- దీనిని సంక్షేమ పాలన అంటారా అని ప్రశ్నించిన లెఫ్ట్
- 11వ రోజుకు చేరుకున్న పోరేకేక యాత్ర
- ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు





ఏలూరు,జూన్30 : ముంపు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా వారిని రోడ్డున పడేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం కోసం తమ భూములను ఇళ్లను త్యాగం చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఇదా అని ప్రశ్నించారు. 11వ రోజు పోరుకేక యాత్ర బుట్టాయగూడెం నుంచ శుక్రవారం ప్రారంభం అయ్యింది. సిఐటియూ నేత గఫూర్ తదితరులు వెంటరాగా యాత్ర సాగింది.పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడం చేతకాకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగిపోవాలని విమర్శించారు. నాలుగేళ్ల పాలనలో జగన్ నిర్వాసితుల గోడు పట్టించుకోలేదని, బిల్లులు రాక ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. వేల కోట్ల పోలవరం నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబానీ, అదాని భజన చేస్తూ నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులను బలవంతంగా తరలించడం దుర్మార్గమన్నారు. వసతులు లేని పునరావాస కాలనీల్లో నిర్వాసితులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్న నిర్వాసితులకు కనీస చిరునామా కూడా కరువైందని తెలిపారు. కొందరు నిర్వాసితులు పునరావాస కాలనీలకు వచ్చినప్పటికీ గతంలో నివాసం ఉన్న గ్రామ చిరునామాతో ఉంటున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన ప్రతి పైసా ముందుగా నిర్వాసితులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం భూమికి భూమి, పరిహారం, నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించకపోతే తిరిగి తమ గ్రామాలకు వెళ్లిపోతామని నిర్వాసితులు చెప్పడం ప్రభుత్వాలకు చెంప పెట్టని అని అన్నారు. సమస్యలను వెల్లడిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు రద్దు చేస్తామని నీచమైన బెదిరింపులు చేయడం తగదన్నారు. నేను కన్నాను.. విన్నాను' అంటూ జగన్ చెబుతున్నారని, అయితే పోలవరం నిర్వాసితుల సమస్యలపై కళ్లుండి చూడని కబోదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇస్తారో.. గోదావరిలో ముంచుతారో తేల్చాలని అన్నారు. నిర్వాసితులు బాధపడుతున్నా పట్టించుకోరా అని అన్నారు. సామాన్యులు చెబితే వినపడదా.. కాంట్రాక్టర్ల మాటలే వింటారా అని మండిపడ్డారు. ఇచ్చిన మాట కోసం అడవులకు వెళ్లిన రాముడు పుట్టిన గడ్డపై ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 26 జిల్లాల ప్రజలకు మేలు చేయడానికి లక్షా ఆరువేల మంది నిర్వాసిత కుటుంబాలు సర్వం కోల్పోయాయని తెలిపారు. గతేడాది గోదావరి వరదలకు 196 గ్రామాలు మునిగిపోతే కేవలం 36 గ్రామాలకు వరద ముంపు ఉందని కాకి లెక్కలు చెబుతున్న ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ అవసరమైతే ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణ డిజైన్లను మారుస్తూ వేల కోట్లు ఖర్చు చూపుతున్న ప్రభుత్వాలకు సిగ్గులేదన్నారు. కాంటూరు, డ్యామ్ డిజైన్లు అన్నీ పనికిమాలిన చెత్తగా అభివర్ణించారు. ముంపునకు గురైన నిర్వాసితులకు రూ.పది వేలు పరిహారం చెల్లిస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని ఎద్దేవా చేశారు. భూమికి భూమి ఇవ్వాల్సిన ప్రభుత్వం వివాదాస్పద భూములను నిర్వాసితులకు కట్టబెట్టి వారి జీవితాలతో ఆటలాడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దుయ్యబట్టారు. భూములకు రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తామని మాట తప్పారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలని నిర్వాసితులకు సూచించారు. నిర్వాసిత కాలనీలో ఉపాధి లేక దిక్కుతోచని స్థితిలో కాలం గడుపుతున్నారని అన్నారు. మోడీ ఉపాధి చట్టాన్ని తీసివేస్తే ప్రజలు ఇంటికి పంపుతారని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక మహాపాదయాత్రకు అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. అధికారం కోసమో.. రాజకీయ లబ్ధి కోసమో కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న సిపిఎం పాదయాత్ర ను ప్రజలే జయప్రదం చేస్తున్నారని అన్నారు. జులై 4న నిర్వాసితుల సమస్యలపై నిర్వాసితులంతా విజయవాడ తరలిరావాలని పిలుపునిచ్చారు. 95 శాతం హామీలు పూర్తి చేసినట్లు జగన్ చెబుతున్నారని, నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని అన్నారు. ఈ ఆరు నెలల్లో హామీల అమలు పూర్తి చేయకపోతే జగన్ ఇంటిదారి పట్టాల్సిందే అన్నారు.

## మణిపూర్‌లో ఆగని హింస
## రాజీనామా యోచనలో సిఎం బీరేన్

న్యూఢిల్లీ,జూన్30 :మణిపూర్‌లో హింసాకాండ కొనసాగడం, అల్లర్లలో ఇప్పటివరకూ వంద మందికి పైగా మరణించడంతో శాంతిభద్రతల వైఫల్యానికి బాధ్యత వహిస్తూ సీఎం ఎన్ బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేస్తారని భావిస్తున్నారు. మణిపూర్ గవర్నర్ అనసూయ యుకీకి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారని తెలిసింది. బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని లేకుంటే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దుతుందని సింగ్ ఎదుట కేంద్రం రెండు ఆప్షన్లను ముందుంచిందని సమాచారం. కాంగ్‌పోక్పి జిల్లా హరోథెల్ గ్రామంలో గురువారం జరిగిన అల్లర్లను ఆపేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి మరణించగా.. అతని మృతదేహాన్ని ఇంఫాల్‌కు తీసుకొచ్చారు. ఇది తెలుసుకున్న ప్రజలు అతనికి నివాళు లర్పించేందుకు పెద్ద ఎత్తున గుమిగూడారు. మృతదేహాన్ని శవపేటికలో ఉంచి ఇంఫాల్ నడిబొడ్డున ఖ్వైరాంబండ్ బజార్ కు తీసుకొచ్చారు. కొందరు నిరసనకారులు శవపేటికను ఊరేగింపుగా ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ నివాసానికి తీసుకెళ్తామని హెచ్చరించారు. పోలీసుల అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు రోడ్ల మధ్యలో టైర్లు కాల్చారు. దీంతో పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన కారులను చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో మృతదేహాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని మార్చురీకి తరలించారు.మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇటీవలే మైతీ సామాజిక వర్గానికి ఎస్టీ హోదా ప్రకటించింది. అయితే నాగా, కుకీ సామాజిక వర్గాలకు చెందిన వారు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

## ముంబైని వీడని భారీ వర్షాలు
## సముద్రంలో ఎగిసి పడుతున్న అలలు



ముంబై,జూన్30 : మహారాష్ట్ర రాజధాని ముంబైలో గత వారం రోజులుగా ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. గత వారం నుంచి విరామం లేకుండా ముంబై నగరాన్ని వర్షాలు ముంచెత్తుతూనే ఉన్నాయి. దాంతో లోతలోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. నగరంలోని అంధేరీ సహా పలు ఏరియాల్లోని అండర్‌పాస్‌లు, సబ్‌వేలలో వరద నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.ఇవాళ ఉదయం కూడా అంధేరీలో భారీ వర్షం పడటంతో సబ్‌వేలో భారీగా వరదనీరు నిలిచింది. దాంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో నీటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమైనప్పటికీ ముంబైలో జూన్ నెలలో కురువాల్సిన వర్షాల్లో 97 శాతం కురిశాయని అధికారులు తెలిపారు. మరోవైపు ముంబైలోని ఆరేబియా సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న మెరైన్ డ్రైవ్ వైపు అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

## ట్విట్టర్‌కు కర్నాటక హైకోర్టు ఝలక్
### కేంద్ర ఆదేశాలపై వేసిన పిటిషన్ కొట్టివేత



బెంగుళూరు,జూన్30 : ట్విట్టర్ సంస్థకు కర్నాటక హైకోర్టు ఝలక్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ట్విట్టర్ సంస్థ దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. 2021 ఫిబ్రవరి నుంచి 2022 మధ్య కేంద్ర ప్రభుత్వం పదిసార్లు ట్విట్టర్‌ను బ్లాక్ చేయాలని ఆదేశించినట్లు ట్విట్టర్ తన పిటీషన్‌లో పేర్కొన్నది. మరో 39 యూఆర్ఎల్స్‌ను కూడా తీసివేయాలని కేంద్ర ఐటీశాఖ ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను తప్పుపడుతూ ట్విట్టర్ దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ కృష్ణ దీక్షిత కొట్టిపారేశారు. ఆ సంస్థపై 50 లక్షల జరిమానా కూడా విధించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఎటువంటి వివరణను ట్విట్టర్ సంస్థ ఇవ్వలేదని న్యాయమూర్తి దీక్షిత్ తెలిపారు. ట్విట్టర్ సంస్థ ఓ రైతు కాదు, ఓ సాధారణ వ్యక్తి కాదు అని, దానికి చట్టం తెలియదన్న విషయం కాదు అని, అదో బిలియనీర్ కంపెనీ అని కోర్టు పేర్కొన్నది. 45 రోజుల్లోగా కర్నాటక లీగల్ సెల్ సర్వీసెస్‌కు 50 లక్షలు చెల్లించాలని కోర్టు ట్విట్టర్‌ను ఆదేశించింది. జస్టిస్ దీక్షిత తన తీర్పులో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను సమర్ధించారు. ట్వీట్లను, అకౌంట్లను బ్లాక్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు.

## బర్డ్ ఆస్పత్రిలో ఆర్థో సమ్మిట్
### ఆర్థోప్లాస్టీ సమ్మిట్‌ను ప్రారంభించిన ఇవో

తిరుపతి,జూన్30 : తిరుపతిబర్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థోప్లాస్టీ సమ్మిట్‌ను టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రారంభించారు. జులై 2 వరకు జరగనున్న ఈ సమ్మిట్‌లో 150 మంది ఆర్థోపెడిక్ సర్జన్లు హాజరవుతారని ఈవో తెలిపారు. ఆర్థో సమస్యలున్న నిరుపేద రోగులైన 22 మంది రోగులకు ఖరీదైన ఆపరేషన్లను ప్రఖ్యాత సర్జన్లు ఉచితంగా చేయనున్నారని, బర్డ్‌లో జరిగే శస్త్ర చికిత్సలను మీటింగ్ హాల్ నుంచి సర్జన్లు లైవ్ వీడియోలో చూసి నేర్చుకుంటారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్థోపెడిక్ సర్జన్లు యూ ట్యూబ్ ద్వారా కూడా చూస్తుంటారని, హోటల్ హాల్ లైవ్‌లో ఆపరేషన్లను చూస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు.. ఆపరేషన్ థీయేటర్‌లోని వైద్యులను లైవ్‌లో అడిగి ఎన్నో సందేహాలు నివృత్తి చేసుకుంటారని ఈవో తెలిపారు.

# చిరు మనవరాలి పేరు క్లీంకార

**అమ్మవారి శక్తి స్వరూపం**

**లలితా సహస్రనామం నుంచి సేకరణ**

**ట్వీట్ చేసిన మెగాస్టార్ చిరంజీవి**



హైదరాబాద్,జూన్30 : గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ,ఉపాసన కొణిదెల దంపతులు పది రోజుల క్రితం తల్లిదండ్రులు అయ్యారు. ఈ సంగతి అందరికీ తెలుసు. మెగాస్టార్ ఇంట మహాలక్ష్మి అడుగు పెట్టిందని అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కొణిదెల, కామినేని కుటుంబాలు చిన్నారి రాకతో సంతోషంలో మునిగాయి. లేటెస్ట్ అప్డేట్ ఏమిటంటే... ఈ రోజు ఆ అమ్మాయికి పేరు పెట్టారు. మెగా మనవరాలికి క్లీంకార కొణిదెల అని పేరు పెట్టినట్లు చిరంజీవి ట్వీట్ చేశారు. లలిత సహస్ర నామం నుంచి పేరు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. క్లీంకార పేరు ప్రకృతి స్వరూపాన్ని సూచిస్తుంది. అమ్మవారి 'శక్తి'ని నిక్షిప్తం చేస్తుంది. ఆ పేరులో శక్తివంతమైన వైబ్రేషన్ ఉంది. మా చిన్నారి పెరిగి పెద్ద అయ్యే కొలదీ ఆ లక్షణాలను పుణికి పుచ్చుకుంటుందని, తనలో నిక్షిప్తం చేసుకుంటుందని నమ్ముతున్నాను' అని చిరంజీవి పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో విడదీసి రాసేలా చూడడంతో క్లిన్, కార అని కొందరు పలుకుతున్నారు. రామ్ చరణ్, ఉపాసన దంపతుల బిడ్డకు 'మెగా ప్రిన్సెస్' అని ఆల్రెడీ అభిమానులు ముద్దుగా పిలవడం మొదలుపెట్టారు. శుక్రవారం మెగా ప్రిన్సెస్ కోసం ఓ ఫంక్షన్ చేశారు. మనవరాలిని మెగాస్టార్ చిరంజీవి ఉయ్యాలలో వేస్తున్నారు. ఉపాసన తల్లిదండ్రులు... అనగా వియ్యంకుల వారితో కలిసి దిగిన ఫోటోను చిరంజీవి షేర్ చేశారు. సాధారణంగా చిన్నారి పుట్టిన 21వ రోజున బారసాల వేడుక చేస్తారు. ఆ రోజు బిడ్డను ఉయ్యాలలో వేయడం, పేరు పెట్టడం చేస్తారు. చిరు మనవరాలు జన్మించి పది రోజులు మాత్రమే అయ్యింది. అయినా పదోరోజే అమ్మాయికి నామకరణం చేశారు.

## ధరణి ఎత్తేస్తే రైతుబంధు రాదు
### ఆసిఫాబాద్ సభలో మరోమారు కేసిఆర్ హెచ్చరిక

ఆసిఫాబాద్,జూన్30 : ధరణి వెబ్‌సైట్‌పై మరోమారు సిఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ధరణి ఎత్తేస్తే రైతుబంధు రాదని తేల్చేశారు. మళ్లీ దళారుల చుట్టూ రైతులు తిరగాల్సి వస్తుందని అన్నారు. ధరణి ఉండాలా వద్దా అంటూ చేతులెత్తాలని సభికులను కోరారు. ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ వచ్చాకే గిరిజన, తండాలను డెవలప్ చేశామని సీఎం కేసీఆర్ అన్నారు. ఒకప్పుడు అంటురోగాలతో ఉమ్మడి ఆదిలాబాద్ తల్లడిల్లిపోయిందని, ఇప్పుడు పరిస్థితి మొత్తం సద్దుమణిగిపోయిందని అన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు అయిందని అన్నారు. రెండు మూడు నెలల్లో మారుమూల తండాలకు, పొలాలకు కూడ త్రీ ఫేస్ కరెంట్ ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణిపై కాంగ్రెస్ నేతలు అవాకులు, చవాకులు పేల్చుతున్నారని అన్నారు. ధరణి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ నేతలు మాత్రం తీసేయాలని అంటున్నారని అన్నారు. ధరణి వల్లే భూములు ఇతరుల పేరు మీదకు మార్చడం కుదరదని, రైతు మరణించగానే రూ.5 లక్షల బీమా అందుతోందని అన్నారు. ధరణి లేకపోతే దళారీల రాజ్యం వస్తుందని, రకరకాల ఇబ్బందులు వస్తాయని అన్నారు. అదే తీసేస్తే రైతుబంధు కూడా అందే పరిస్థితి కూడా ఉండబోదని అన్నారు. మహారాష్ట్రలో కూడా ప్రజలు బీఆర్ఎస్ పథకాల పట్ల ఆకర్షితులు అవుతున్నారని, మాకు కూడా ఆ పథకాలు కావాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరుతున్నారని అన్నారు.

## పోలవరం జాతీయప్రాజెక్టు అయితే..
## నిర్వాసితుల సమస్యలూ జాతీయ సమస్యలే
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు స్పష్టీకరణ

జంగారెడ్డిగూడెం,జూన్30 : పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు అయితే నిర్వాసితుల సమస్యలు కూడా జాతీయ సమస్యలే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. జంగారెడ్డిగూడెం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల జీవన్మరణ సమస్యపై సాగుతున్న యాత్ర నాతో పాటు వందలాది మంది యువతీ, యువకులు అందులోనూ మహిళలు అత్యంత పట్టుదలతో యాత్ర సాగిస్తున్నారు. సముచితమైన కోరికకు సంఘీభావం తెలుపుతున్నారు. చివరికి అధికారపార్టీకి చెందిన సర్పంచ్, ఎమ్.టి.సిలు మద్దతు ఇచ్చారు. ఇది ఒక పార్టీ సమస్య కాదు. ఇప్పటికి చీఫ్ సెక్రటరీని, గవర్నర్ ని కలిసి లేఖ ఇచ్చాము. భవిష్యత్ లో నీటిపారుదల శాఖమంత్రిని, రాష్ట్రపతిని కలుస్తాము. రాష్ట్రపతి గిరిజన బిడ్డ, ఆమెను అవమానించిన ప్రధాని గిరిజన సమస్యలు పట్టించుకుంటాడని అనుకోవాల్సిన పని లేదు. మనం మాత్రం గిరిజన బిడ్డగా సమస్యను పరిష్కరించాలని రాష్ట్రపతికి వినవించాలి. తెలుగుదేశం గిరిజన నిర్వాసితుల సమస్యలే మా ప్రధానమైన ఎడెండా అని ప్రకటించాలి. 500 మంది మేధావులు బిజెపికి వ్యతిరేకంగా నిలబడాలని ప్రకటించారు. ఆ ప్రకటనను సిపిఎం ఆహ్వానిస్తుంది. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి గోరికట్టాల్సిందే. కార్మిక వర్గం నాయకత్వం మె?త్తం పాదయాత్రలో పాల్గొని మద్దతు వచ్చినందకు కృతజ్ఞతలు. పోలవరం నిర్వాసితులకు 1వ తేదీన కార్మిక వర్గం సంఘీభావం తెలిపినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాము' అని అన్నారు.

## ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన జెండా ఎగరాలి






**పవన్ సమక్షంలో జనసేనలో చేరిన తోట సుధీర్**

**వైసిపిని ఓడించడం పెద్ద పనేమీ కాదన్న పవన్**

భీమవరం,జూన్30(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన జెండా ఎగరాలని జనసేనాని పవన్‌కల్యాణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వారాహి యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించారు. ఆయన కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి మాట్లాడారు. కాకినాడలో నేరస్థులను ఎదుర్కోవాలంటే చట్టం తెలిసిన బలమైన నాయకుడు కావాలని ఆకాంక్షించారు. ఇక గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకూడదన్నారు. ఇది కష్టమేనని తెలుసు.. అయినా కూడా లక్ష్య సాధన దిశగా అందరూ పనిచేయాలని కోరారు. తాను అమ్ముడుపోవాలనుకుంటే అది చాలా తేలికైన పని అని చెప్పు కొచ్చారు. వ్యక్తిగతంగా ఏ పదవో.. ఏ మంత్రి పదవో అడిగితే సరిపోతుందన్నారు. కానీ తాను ఆలోచించేది కార్యకర్తల కోసమేనని స్పష్టం చేశారు. తనకు నిరాశ నిస్పృహలు ఉంటాయి.. కానీ కొంతమంది నాయకుల రాక వలన కొత్త ఉత్సాహం వస్తుందని పవన్‌కల్యాణ్ చెప్పుకొచ్చారు. వైసీపీ జెండా ఎగరకూడదన్నది.. ఎవరెస్ట్ ఎక్కడం కంటే ఎంతో సులభమన్నారు. కాకినాడ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, కాకినాడ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ తోట సుధీర్ శుక్రవారం భీమవరంలో జరిగిన కార్యక్రమం లో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైసీపీ గెలవకూడదు అనడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి లేదు.. రైతులకు లాభం సంగతి పక్కన పెడితే కనీసం గిట్టుబాటు ధర దక్కడం లేదు. గిట్టుబాటు కల్పించకపోగా ప్రతి బస్తాకీ రూ.వంద చొప్పున దోచుకుంటున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. సగటు యువతకు ఉపాధి, రైతుకి గిట్టుబాటు ధర లాంటివి సాధించాలంటే చట్టాల మీద అవగాహన ఉన్న వ్యక్తుల సమూహం అవసరం. తోట సుధీర్ లాంటి వ్యక్తుల రాకతో పార్టీ బలంగా పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేరస్తులను ఎదుర్కోవాలంటే చట్టాల మీద అవగాహన ఉన్న వ్యక్తుల మద్దతు అవసరం అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను అధిగమించి ముందుకు వెళ్లాలన్నా చట్టాల మీద సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులు కావాలన్నారు. రాజకీయాల్లోకి పోరాట పటిమ, విలువలు ఉన్న వారు రావాలన్నది తన ఆకాంక్ష అని అన్నారు. ప్రముఖ న్యాయవాది తోట సుధీర్ లాంటివారు జనసేన పార్టీలో చేరికతో అది నెరవేరిందన్నారు. సుధీర్ తో వ్యక్తిగత సాన్నిహిత్యం ఉన్నా ఎప్పుడూ రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించలేదు. వారి కుటుంబం మొత్తం మద్దతు ఇచ్చి పంపారు. ఆయనతోపాటు పార్టీలో చేరేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ 5 వేల మందిని కదిలించే శక్తి ఉంది. వచ్చే ఎన్నికల్లో కాకినాడలో జనసేన జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో అమ్ముడుపోవడం తేలిక. నా మటుకు నాకు పుట్టిన నేల బాగుండాలి.. దేశం బాగుండాలి అన్న కోరిక తప్ప మరే కోరికా లేదు. అడ్డదారులు తొక్కకుండా నిజాయతీగా రాజకీయాలు చేయడం చాలా కష్టం. ఆ విధంగా నిలబడ్డాం కాబట్టే ఈ రోజు ప్రతి ఒక్కరూ మన వైపు వస్తున్నారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యా నించారు.

## యువతి మిస్సింగ్ కేసు
## ఛేదించిన దిశ పోలీసులు
### అనంతపురంలో స్నేహితుడి ఇంట్లో గుర్తింపు




గుంటూరు,జూన్30 : పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే సంగీత అనే యువతి కనిపించడం లేదని కుటుంబసభ్యులు దిశ ఎస్ఓఎస్ కు కాల్ చేసి ఫిర్యాదు ఇచ్చారు. గుంటూరు లోని ఓ వస్త్ర దుకాణంలో సంగీత పనిచేస్తోంది. గురువారం ఉదయం డ్యూటీ కి వెళ్లిన సంగీత రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటం, అర్ధరాత్రి అయినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు దిశకు కాల్ చేసి సహాయం కోరారు. కేవలం ఎనిమిది నిముషాల వ్యవధిలో వెంగళరావు నగర్ నివాసం ఉంటున్న బాధితుల ఇంటికి దిశ పోలీసులు చేరుకున్నారు. యువతి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదకాకాని పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. టవర్ లొకేషన్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా అనంతపురం లోని స్నేహితుడి ఇంట్లో యువతి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇంట్లో జరిగిన గొడవ కారణంగానే అనంతపురం వెళ్లినట్లు యువతి స్పష్టం చేసింది. సంగీత క్షేమంగా ఉందనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు పోలీసులు. అదేవిధంగా యువతికి, కుటుంబసభ్యులకు దిశ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

# సోషల్ మీడియా నిబంధనల్లో సంస్కరణలు

**జూలై 5 న విజయవాడలో సెమినార్**

**సోషల్ మీడియాపై న్యాయ, పోలీస్ వ్యవస్థల్లో సమీక్షలు**

**వ్యక్తిత్వ హననం జరుగుతోంది : వాసిరెడ్డి పద్మ**

అమరావతి,జూన్30 : సోషల్ మీడియా నిబంధనల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళ కమిషన్ అధ్యక్షురాలు వాసిరెడ్డి పద్మ తెలిపారు. శుక్రవారం సచివాలయం లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మహిళలపై పైశాచికత్వానికి పరాకాష్టగా సోషల్ మీడియాలో పోస్టింగులు ట్రోల్ చేయడం రాతియుగంలో కూడా లేని హీనత్వాన్ని తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులకు చెందిన మహిళలపై అసభ్యకరమైన పదజాలంతో పాటు అశ్లీల చిత్రాలు, అక్రమ సంబంధాల వంటి కట్టు కథల పోస్టింగులు సోషల్ మీడియాలో ట్రోల్ అవ్వడం ఎంతో జుగుప్సాకరమైన విషయం అన్నారు. యు.కె. లో ఉంటున్నటు వంటి ఒక మహిళ రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారి కుటుంబ మహిళలపై సోషల్ మీడియాలో ఎంతో బాధాకరమైన పోస్టులు పెట్టడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. అయితే అటువంటి వారిని ప్రతిపక్షాల వారు సమర్థించడం అనేని ద్వంద నీతికి నిదర్శనమన్నారు. ఇటువంటి సందేశాలు ఇవ్వడం ద్వారా వారు సమాజానికి ఎటు వంటి సంకేతాలు ఇస్తున్నారు అనే విషయాన్ని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చైర్ పెర్సన్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టుకు పోస్టు పెట్టడమే సమాధానం కాదని, ఎంతమాత్రం సమర్థనీయం కూడా కాదని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియా సమాజంలో సృష్టించే దారుణాతి దారుణమైన పరిస్థితులను నియంత్రించడంలో న్యాయ, పోలీస్ వ్యవస్థలు కూడా ఏమీ చేయలేని పరిస్థితులో ఉండటం వల్ల సమస్య మరింత జటిలం అవ్వడానికి దారితీస్తున్నదన్నారు. సోషల్ మీడియా దాడిని యాసిడ్ దాడులు, హత్యాయత్నాలతో సమానంగా చూడాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. వ్యక్తిత్వ హననం హత్య కంటే దారుణంగా మారినప్పుడు చట్టాలకు పదును పెట్టి అదుపుతప్పున సోషల్ మీడియాను కట్టడి చేయాల్సిన అవసం ఎంతో ఉందన్నారు.ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో సంస్కరణలు తీసుకురావల్సిన ఆవశ్యకతపై పలువురి సూచనలు, సలహాలను స్వీకరించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో జూలై 5న విజయవాడలో ఒక సెమినార్ ను నిర్వహించనున్నట్లు మహిళా కమిషన్ చైర్ పెర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు.

# బ్రో టీజర్‌తో అభిమానుల్లో పూనకం



పవన్ టైమింగ్ యాక్షన్ అంటూ కామెంట్స్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'బ్రో' సినిమా టీజర్ తాజాగా రిలీజై సినీ ప్రియులను అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా పవన్ వింటేజ్ లుక్స్ ఆయన మేనల్లుడు సాయి తేజ్ కామెడీ టైమింగ్‌తో పాటు తమన్ మ్యూజిక్ ప్రచర చిత్రానికే హైలైట్‌గా నిలిచింది. మెగా అండ్ పవన్ ఫ్యాన్స్లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో ఈ టీజర్ను సోషల్మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు పవన్ అభిమానులు. అలాగే మరోవైపు ఈ ప్రచార చిత్రంలోని మరొక విషయాన్ని కూడా ఫుల్ ట్రోల్ చేస్తున్నారు. అదేంటనుకుంటున్నారా.. 'బ్రో' టీజర్లో హీరోయిన్ పూజా హెగ్డే కనిపించడం గురించి అంతా ఆత్రుతగా చూశారు. అదేంటి పూజాహెగ్డే ఎక్కడ కనిపించింది అని ఆలోచిస్తున్నారా? టీజర్ చూడాలనే ఆత్రుతలో కొంతమంది ముందు సరిగ్గా చూసి ఉండకపోవచ్చు. టీజర్ ప్లే చేయగానే.. ముందుగా ఓ షాపింగ్ మాల్ యాడ్ పోస్టర్ ప్రదర్శన అవుతుంది.ఆ తర్వాతే ప్రచార చిత్రం మొదలవుతుంది. ఆ అడ్వటైజ్ మెంట్లోనే పూజా హెగ్డే కనిపించింది. ఆ యాడ్ కూడా ఎలా కనిపించిందంటే.. సినిమాలో భాగంలా కనిపించింది. మేకర్స్ వీడియోను అలానే కట్ చేసి రిలీజ్ చేశారు. దీంతో ఇప్పుడా పోస్టర్నే నెటిజన్లు అభిమానులు తెగ ట్రోల్ చేసేస్తున్నారు. బ్రో సినిమాకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆయనే.. పూజా హెగ్డేను టీజర్ లో యాడ్ చేశారని.. అందుకే ప్రచార చిత్రాన్ని ఆలస్యంగా రిలీజ్ చేశారంటూ కొంతమంది సరదాగా తెగ కామెంట్స్ కూడా చేస్తున్నారు.దర్శకధీరుడు రాజమౌళికి తన ప్రతి సినిమాకు తన బ్రాండ్ స్టాంప్ ఎలా అయితే ఉంటుందో.. త్రివిక్రమ్ కు పూజాహెగ్డే ఉంటుందని పోస్ట్ లు పెడుతున్నారు. ఈ టీజర్లో పెట్టడానికేనా .. మహేశ్ బాబు 'గుంటూరు కారం' నుంచి తప్పించావ్ అంటూ మాటల మాంత్రికుడుపై సరదా సెటైర్లు కూడా వేస్తున్నారు. పూజా లేకుండా త్రివిక్రమ్ సినిమాలు చేయలేరు. ఎక్కడ ఓ చోట ఆమె కనపడాల్సిందే.. లేదా పేరైనా ఉండాల్సిందే. ఇక 'బ్రో' సినిమా విషయానికొస్తే.. తమిళంలో సూపర్ హిట్గా నిలిచిన వినోదయ సీతమ్‌కు రీమేక్‌గాఇది రూపొందోంది. తమిళంలో సముద్రఖని స్వీయ దర్శకత్వంలో రూపొందిందీ చిత్రం. ఆయనే తెలుగులో దర్శకత్వం వహించారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ జీ స్టూడియోస్ కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జులై 28న తేదీన ఈ సినిమా భారీ స్థాయిలో విడుదల కానుంది.

## ప్రజ్వల సంస్థ చేసిన ఊయలలో బారసాల

### రామ్‌చరణ్ దంపతులు వెల్లడి




అంబానీ బంగారు ఊయలేం పంపలేదు... కర్రతో చేసిన ఊయలనే మా కూతురు బారసాలలొ ఉపయోగిస్తున్నామని రామ్ చరణ్, ఉపాసన దంపతులు స్పష్టం చేశారు. మెగా ఫ్యామిలీలో శుక్రవారం వేడుక జరుగుతోంది. రామ్‌చరణ్ - ఉపాసన దంపతుల ముద్దుల పుత్రిక బారసాల చిరంజీవి నివాసంలో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఏర్పాట్ల వీడియోను ఉపాసన తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అయితే తాజాగా మరో వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ప్రముఖ వ్యాపారవేత్త ముఖేశ్ అంబానీ ఇటీవల బంగారు ఊయలను కానుకగా పంపించారని.. అందులోనే చిరంజీవి మనవ రాలు క్రెడిల్ సెర్మనీ చేయబోతున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై రామ్‌చరణ్ టీమ్ స్పందించింది. ఆ వార్తల్లో నిజం లేదని టీమ్ తెలిపింది. ప్రజ్వల ఫౌండేషన్ వాళ్లు సిద్ధం చేసిన చెక్క ఉయ్యాలనే ఈ వేడుకల్లో ఉపయోగిస్తునట్లు తెలిపారు. ఇటీవల ప్రజ్వల సంస్థలోని పలువురు మహిళలు రామ్‌చరణ్ దంపతులకు పుట్టబోయే బిడ్డ కోసం ఓ ఉయ్యాలను తయారు చేశారు. ఎలాంటి మెషీన్ ఉపయోగించుండా చేతితోనే ఈ ఉయ్యాల తయారు చేయడం ప్రత్యేకత. ఈ విషయాన్ని ఉపాసన కూడా సోషల్ మీడియాలో షేర్ చేసి ప్రజ్వల ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చేతితో తయారు చేసిన ఈ ఉయ్యాలకు ప్రాముఖ్యత ఉంది. బలం, ఆశకు ఇది ప్రతీక అని ఉపాసన పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే! అయితే ఈ రోజు చిరు మనవరాలిని ఉయ్యాలలో వేయడంతోపాటు మెగా ప్రిన్సెస్‌కు నామకరణం కూడా చేస్తారని టాక్ వినిపిస్తోంది. రామ్‌చరణ్ మాత్రం సంప్రదాయం ప్రకారం 21వ రోజున పేరు పెడతామని, ఇప్పటికే పాపకు ఓ పేరు అనుకున్నట్లు ఉపాసన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన సందర్భంలో చెప్పారు.

## నటనలో ఒదిగిపోయే నటుడు జగపతిబాబు

### రుద్రంగి ప్రీ ఈవెంట్‌లో బాలయ్య కితాబు




నటసింహ బాలయ్య సినిమాల్లో ఆయన డైలాగులు ఎంత ఫవర్ ఫుల్ గా ఉంటోయో చెప్పాల్సిన పనిలేదు. యాక్షన్ సన్నివేశాలకు ముందు ప్రతి నాయకుడికి బాలయ్య ఇచ్చే వార్నింగ్ నెక్స్ట్ లెవల్లో ఉంటుంది.అందులోనూ బాలయ్యకి బోయపాటి తోడయ్యాడంటే ఆ సన్నివేశం ఇంకెంత రసవత్తరంగా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. భారీ డైలాగులు.. ఆవేశం తో నాయకా..ప్రతినాయకులు ఊగిపో వడం.. అరుపులు.. కేకలు మామూలుగా ఉండవు. అందుకే బాలయ్య సినిమాలకి మాస్ ఫాలోయింగ్ లోనూ ప్రత్యేకమైన అభిమానులుంటారు. తాజాగా నటసింహ ఓ సినిమా ఈవెంట్ లో భాగంగా యాక్టింగ్ అంటే ఎలా? ఉండలో వివరించే ప్రయత్నం చేసారు. 'నటనంటే అవరవడమో..ఏడవడమో.. నమ్మించడమో కాదు' నటనంటే.. ఓ పరకాయ ప్రవేశం ఆపాత్రలోకి వెళ్లినప్పుడు ఆ పాత్ర తాలుకా అనుభవాల్ని ఆస్వాదించాలి. అందులో జీవించాలి.అలా ఏ పాత్రలోనైనా నటించే గలిగే గొప్ప భారతీయ నటుల్లో జగపతి బాబు ఒకరని ప్రశంసించారు. జగపతి బాబు ప్రధాన పాత్ర పోషించిన 'రుద్రంగి' ప్రీ రిలీజ్ ఈవెంట్ లోనే బాలయ్య వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాలయ్య నటన గురించి చక్కగా వివరించా రంటూ అభిమానులు కొనియాడుతున్నారు. అలాగే బాలయ్య పాత సినిమా డైలాగుల్ని షేర్ చేస్తున్నారు. రకరకాల సన్నివేశాల్లో బాలయ్య ఎక్స్ ప్రెషన్స్..సెంటిమెంట్ డైలాగులు..ఏ పాత్రలో ఎలాంటి ఆహార్యంలో కనిపించారు. వాటి హావభావాలు ప్రత్యేకంగా పిన్ టూ పిన్ షేర్ చేస్తున్నారు. ఇక వెండి తెరపై బాలయ్య చేసినన్ని ప్రయోగాలు ఏ హీరో చేయలేదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా పరిచయమైన నటసింహం విభిన్న రకాల పాత్రలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు. త్వరలో 'భగవంత్ కేసరి'గా ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. ఇటీవలే ఆ సినిమా షూటింగ్ పూర్తయింది.

## ఆశాజనకంగానే స్పై కలెక్షన్లు




టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ నటించిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్పై. ఆజాద్ హింద్ ఫౌజ్ సృష్టికర్త సుభాష్ చంద్రబోస్ విమాన ప్రమాద మిస్టరీ నేపథ్యంలో తెరకెక్కింది. పాపులర్ ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. ఐశ్వర్యా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించిన స్పై జూన్ 29న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. కాగా ఓపెనింగ్ డే కలెక్షన్లకు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. తాజా అప్‌డేట్ ప్రకారం స్పై నిఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ రాబట్టిన సినిమాగా నిలిచింది. స్పై చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొదటి రోజు రూ.11.70 కోట్లు గ్రాస్ రాబట్టింది. అందేకాదు చాలా కేంద్రాల్లో హౌస్‌ఫుల్ షోలతో స్పై స్క్రీనింగ్ అవడమే కాకుండా.. కొత్తగా మరిన్ని థియేటర్లు యాడ్ కాబోతున్నాయని ట్రేడ్ సర్కిల్ సమాచారం. స్పైలో దగ్గుబాటి రానా కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రాన్ని కే రాజశేఖర్ రెడ్డి నిర్మించారు. నేతాజీ మరణం మిస్టరీని ఛేదించే క్రమంలో సాగే యాక్షన్ సన్నివేశాలతో సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగుతూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటి పెంచుతోంది. చరిత్ర మనకు ఎప్పుడూ నిజం చెప్పదు.. అంటూ నేతాజీ ÷ల్స్, మరణం మిస్టరీని చేధించే క్రమంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయనే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తోపాటు స్వాతంత్ర్యం అంటే ఒకడిచ్చేది కాదు.. లాక్కునేది..అని సినిమాలో వచ్చే డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేసేలా సాగుతున్నాయి. నిఖిల్ మరోవైపు ది ఇండియా హౌజ్, స్వయంభు, కార్తికేయ 3 సినిమాలను కూడా లైన్‌లో పెట్టాడు.


## జంతుబలిపై రష్మి కామెంట్స్... మండిపడుతున్న నెటిజన్స్




టీవీ యాంకర్, నటి రష్మీ గౌతమ్‌కు వివాదాలు కొత్తేమీ కాదు. ఆమె జంతు ప్రేమికు రాలు. లాక్‌డౌన్ సమయంలో తను ఉండే ఏరియాలో ఉండే శునకాలకు ప్రతి రోజూ ఆహారం పెట్టేది. మూగ జీవాలను హింసించడాన్ని ఆమె అసలు సహించదు. ఇలాంటి విషయాలు ఆమె దృష్టికి వచ్చిన ప్రతిసాకీ ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూ ఉంటుంది. జంతు ప్రేమి కురాలిగా ఆమె చేసే ట్వీట్లు, పోస్ట్‌లు మిస్ ఫైర్ అయ్యి వివాదాలకు దారి తీసిన సందర్భాలెన్నో ఉన్నాయి. తాజాగా ఆమె చేసిన ఓ ట్వీట్‌తో మరో వివాదంలో చిక్కుకుంది రష్మి. జంతువులను హింసించి, బలి ఇచ్చే ఆచారాలపై మండిపడుతూ తరచూ పోస్ట్‌లు చేసే ఆమె తాజాగా 'బక్రీద్' పండుగ సందర్భంగా ఓ పోస్ట్ చేసింది రష్మీ. అందరిని తిడుతూ చేసిన పోస్ట్‌తో నెటిజన్ల ఆగ్రహానికి, విమర్శలకు గురవుతోంది. అమెరికాలో జంతు బలికి సంబంధించిన ఫొటోలను ఓ నెటిజన్ షేర్ చేయగా ఆ ట్వీట్‌కు రష్మీ కామెంట్ చేసింది. ముస్లింలు, జంతు బలికి సంబంధించిన ఆ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతుంది. ఇదే ఇప్పుడు రష్మీ గౌతమ్ ను విమర్శలకు గురి చేస్తోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా విమర్శిస్తున్నారు. 'పండగల సమయంలోనే జంతువుల మీద నీకు అంత ప్రేమ' అంటూ ఓ నెటిజన్ రాసుకొచ్చాడు. 'పెద్ద పెద్ద కంపెనీలు నాన్ వెజ్‌లో వెరైటీలను చేస్తున్నారు. వాటికి స్టార్స్‌తో పబ్లిసిటీ చేయిస్తున్నారు.. వాళ్లను ఎందుకు ప్రశ్నించలేకపోతున్నావ్' అని కామెంట్ చేశాడు.

# లియోనల్ మెస్సీ మరో ఘనత

### చాంపియన్స్ లీగ్ గోల్ ఆఫ్ ది సీజన్' అవార్డు



న్యూఢిల్లీ,జూన్30 : ఫుట్‌బాల్ దిగ్గజాల్లో ఒకడైన లియోనల్ మెస్సీ మరో ఘనత సాధించాడు. ఈ ఏడాది 'చాంపియన్స్ లీగ్ గోల్ ఆఫ్ ది సీజన్' అవార్డు సొంతం చేసుకున్నాడు. రియల్ మాడ్రిడ్ ఆటగాడు వినిసియస్ జూనియర్, ఎర్లింగ్ హాలాండ్లను వెనక్కి నెట్టి మరీ మెస్సీ ఈ అవార్డు దక్కించుకున్నాడు. పీఎస్‌జీ క్లబ్ తరఫున ఆడిన సమయంలో బెన్‌ఫికా జట్టుపై చేసిన గోల్ అతడికి ఈ అవార్డు తెచ్చిపెట్టింది. ఆ మ్యాచ్‌లో మెస్సీ ఎడమ కాలితో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ÷స్సీ వచ్చే సీజన్‌లో కొత్త క్లబ్‌కు ఆడనున్నాడు. పీఎస్‌జీతో రెండేళ్ల కాంట్రాక్టు ముగియడంతో అతను ఈమధ్యే అమెరికాకు చెందిన ఇంటర్ మియామి క్లబ్‌కు మారాడు. అతడిని దక్కించుకునేందుకు బార్సిలోనా, సౌదీ అరేబియాకు చెందిన అల్ హిలాల్ ప్రయత్నించాను. కానీ, మెస్సీ మాత్రం వీటిని కాదని ఇంటర్ మియామికి ఓకే చెప్పాడు. మేజర్ సాకర్ లో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. అక్కడ అర్జెంటీనా, బార్సిలోనా మాజీ కోచ్ గెరార్డ్ టాటా మర్టినో దగ్గర తన ఆటను మరింత మెరుగుపరుచుకోనున్నాడు. ఈ స్టార్ ప్లేయర్ నిరుడు అంటీనాకు వరల్డ్ కప్ అందించిన విషయం తెలిసిందే. ఉత్కంఠ రేపిన ÷నైల్ పోరులో మెస్సీ జట్టు 4-2తో ఫ్రాన్స్‌ను చిత్తు చేసింది. కైలియన్ ఎంబాపే హ్యాట్రిక్ గోల్స్‌తో భయపెట్టినా కూడా జట్టును గెలిపించలేకపోయాడు.

## దేశం తరఫున ఆఖరి మ్యాచ్ ఎప్పుడో..? ఇప్పుడే చెప్పలేనన్న ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రీ



న్యూఢిల్లీ,జూన్30 : భారత స్టార్ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రీ స్వదేశంలో జరుగుతున్న దక్షిణాసియా చాంపియన్‌షిప్ లో అదరగొడుతున్నాడు. పాకిస్థాన్‌పై హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన అతను జట్టును సెమీస్‌కు చేర్చాడు. తాజాగా అతను తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పట్లో ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలకాలనే ఆలోచన తనకు లేదని అన్నాడు. 'దేశం తరఫున నా ఆఖరి మ్యాచ్ ఎప్పుడనేది ఇప్పుడే చెప్పలేను. అయితే.. జట్టుకు నా వంతు సహకారం అందిస్తున్నానా? లేదా? నేది ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటా. కుటుంబసభ్యులు పదే పదే రిటైర్మెంట్ గురించి అడుగుతుంటారు. అప్పుడు వాళ్లకు నా ఫుట్‌బాల్ గణాంకాలు చూపిస్తా' అని ఛెత్రీ తెలిపాడు. టీమిండియా ఫుట్‌బాల్‌కు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ఘనత కచ్చితంగా ఛెత్రీకి చెందుతుంది. అతడి కెప్టెన్సీలో భారత జట్టు తన ఫిఫా ర్యాంకింగ్ మెరుగుపరుచుకుంది. ఐదేళ్ల తర్వాత వందలోపు ర్యాంకు సాధించింది. శాఫ్ చాంపియన్‌షిప్ ముందు టీమిండియా 101వ ర్యాంక్‌లో ఉండేది. ప్రస్తుతం వందో స్థానంలో నిలిచింది. మరోవైపు.. ఈ టోర్నీలో ఇప్పటికే 22 గోల్స్ కొట్టిన ఛైత్రీ మరో రికార్డుపై కన్నేశాడు. భారత కెప్టెన్ ఒక్క గోల్ కొడితే మాల్దీవ్స్ లెజెండ్ అలీ అష్ఫక్ (గ్గ÷తి ంబఠౌజీస) సరసన చేరతాడు. అష్ఫక్ 23 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం ఛెత్రీ ఖాతాలో 22 గోల్స్ ఉన్నాయి. శాఫ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# వింబుల్డన్ టోర్నమెంట్ డ్రా విడుదల

### జూలై 3వ తేదీ నుంచి జూలై 16 వరకు టోర్నీ



న్యూఢిల్లీ,జూన్30 ఈ ఏడాది వింబుల్డన్ టోర్నమెంట్ డ్రా వచ్చేసింది. గ్రాండ్‌స్లామ్ నిర్వాహకలు డ్రా వివరాలు వెల్లడించారు. పురుషుల సింగిల్స్ వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్, మహిళల టాప్ సీడ్ ఇగా స్వియటెక్ లకు కఠినమైన డ్రా ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్, వరల్డ్ నంబర్ 2 నొవాక్ జకోవిచ్కు కూడా సులభమై డ్రా దొరికింది. 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన అతను క్వార్టర్ ఫైనల్లో ఆండ్రే రుబ్లెవ్‌ను ఢీ కొట్టనున్నాడు.హిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఎలీనా రిబాకినాకు కూడా గట్టి పోటీ ఎదురుకానుంది. వింబుల్డన్ టోర్నమెంట్ జూలై 3వ తేదీ నుంచి జూలై 16 వరకు జరగనుంది. ఈ వారమే క్వీన్స్ క్లబ్ టైటిల్ గెలిచిన అల్కరాజ్ వింబుల్డన్‌లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. అయితే. ఇప్పటివరకు గ్రాస్ కోర్టులో నాలుగో రౌండ్ దాటలేదు. దాంతో, ఈసారి ఎలాగైనా టైటిల్ సాధించాలనుకుంటున్న అతడికి ఆ తర్వాతి రౌండ్‌లలో గట్టి పోటీ ఎదురుకానుంది. తొలి మ్యాచ్‌లో ఈ యువ సంచలనం 534వ ర్యాంకర్ జెరెమీ చార్డీతో తలపడనున్నాడు. 6వ సీడ్ హోల్గర్ రునే లేదా ఫ్రాన్సెస్ తైఫోతో క్వార్టర్గ ÷నైల్ ఆడనున్నాడు. సెమ్గీ÷నైల్ బెర్తు కోసం అతను మూడో సీడ్ డానిల్ మెద్వెదేవ్, స్టెఫనోస్ త్సిత్సిపాస్ లేదా కామెరూన్ నోరీలలో ఒకరిని ఢీ కొంటాడు. వింబుల్డన్‌లో సీడింగ్ దక్కించుకోలేకపోయిన బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే తమ దేశానికే చెందిన రియాన్ పెనిస్టోన్‌తో తొలి మ్యాచ్ ఆడనున్నాడు. నిరుడు ÷నైల్ ఆడిన నిక్ కిర్గియోస్(ఔతిషీ ఐ÷ూసణతీనీబ) 30వ ర్యాంక్‌తో బరిలోకి దిగుతున్నాడు. అతడు తొలి మ్యాచ్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించిన డేవిడ్ గొఫిన్‌తో ఆడనున్నాడు.

# యాషెస్ రోండో టెస్ట్

### ఇంగ్లండ్‌ను దెబ్బతీసిన ఆసిస్



లార్డ్స్,జూన్30 : యాషెస్ రెండో టెస్టులోనూ ఇంగ్లండ్ బ్యాటర్లు తడబడ్డారు. లార్డ్స్ మైదానం లో రెండో రోజు ప్రదర్శించిన దూకుడును మూడో రోజు కొనసాగించలేకపోయారు. బాజ్‌బాల్ ఆటతో అదరగొడతారనుకున్న హ్యారీ బ్రూక్(50), బెన్ స్టోక్స్(17), జానీ బెయిర్‌స్టో(16) నిరాశపరిచారు. దాంతో, ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకే ఆలౌటయ్యింది. పర్యాటక ఆస్ట్రేలియాకు 91 పరుగులు ఆధిక్యాన్ని సమర్పించుకుంది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ మూడు వికెట్లతో చెలరేగాడు. పార్ట్ టైమ్ స్పిన్నర్ ట్రావిస్ హెడ్, జోష్ హేజిల్‌వుడ్ రెండేసి వికెట్లతో ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు. ఓవర్ నైట్ స్కోర్ 278/4 తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. హాఫ్ సెంచరీ కొట్టిన హ్యారీ బ్రూక్(50)ను స్కార్క్ ఔట్ చేశాడు. ఆ కొద్ది సేపటికే కెప్టెన్ బెన్ స్టోక్స్(17) ఒక్క పరుగు చేయకుండా నే వెనుదిరిగాడు. ఆదుకుంటాడనుకున్న జానీ బెయిర్‌స్టో(16)ను హేజిల్‌వుడ్ వెనక్కి పంపాడు. దాంతో, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. జోష్ టంగ్(1)ను కమిన్స్ ఔట్ చేయడంతో 325 పరుగుల వద్ద స్టోక్స్ సేన ఆలౌటయ్యింది. దాంతో, ఆసీస్‌కు 91 పరుగలు ఆధిక్యం లభించింది. మొదట ఆడిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 416 రన్స్ కొట్టింది. స్టీవ్ స్మిత్(110) వరుసగా రెండో శతకంతో ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ట్రావిస్ హెడ్(77), డేవిడ్ వార్నర్(0) అర్ధ శతకాలు బాదడంతో ఆసీస్ భారీ స్కోర్ చేయగలిగింది. తొలి టెస్టులో గెలిచిన కమిన్స్ సేన ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com